

రాష్ట్రంలో అలర్లు, అశాంతి రేకెత్తించేలా జగన్ కుట్రలు చేస్తున్నారు.5 ఏళ్ల వైసీపీ అరాచక పాలన తర్వాత ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నారు. అది చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ నేతలు విద్వేషాలు రెచ్చగొట్టి అశాంతిని నెలకొల్పాలని చూస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి జగన్ వైరస్‌లా మారారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 04.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 316 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతకు ప్రాధాన్యత

## ఉద్రిక్తతల మధ్య ఒమన్,కువైట్ నేతలతో ప్రధాని మోడీ కీలక చర్చలు

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఆ ప్రాంతాల నేతలతో కీలక చర్చలు జరిపారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్, కువైట్ యువరాజు షేక్ సభా అల్-ఖలీద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సభాలతో ఆయన టెలిఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

**భారతీయుల భద్రతపై ఆరా :** ఆయా దేశాల్లో జరుగుతున్న దాడుల పట్ల ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ పౌరుల భద్రత, వారి క్షేమ సమాచారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పౌరుల రక్షణను విస్మరించకూడదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**రంజాన్ వేళ ఆందోళన :** పవిత్ర రంజాన్ మాసంలో ఈ ప్రాంతంలో పరిస్థితులు అంతకంతకూ క్షీణించడం పట్ల భారత్ విచారం వ్యక్తం చేసింది. కాగా, ప్రధాని మోడీ సోమవారం (మార్చి 2) కూడా గల్ఫ్ దేశాల నేతలతో సంభాషించారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్లతో చర్చలు జరిపారు. బహ్రెయిన్‌పై జరిగిన దాడులను ఖండిస్తూ, ఆ దేశానికి తన సంఘీభావం ప్రకటించారు. భారతీయుల పట్ల బహ్రెయిన్ చూపుతున్న ఆదరణకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో గల్ఫ్ ప్రాంతంలో ఉన్న భారతీయ కమ్యూనిటీలో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం ఆయా దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోంది.

అటు పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై విదేశాంగ శాఖ కూడా తీవ్ర ఆందోళ వ్యక్తం చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి దిగజారడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చడంతో పాటు ఇతర దేశాలకు కూడా విస్తరించిందని తెలిపారు. విధ్వంసం, ప్రాణనష్టం పెరుగుతుండగా సాధారణ జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు పెరగకుండా నివారించాలని, పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ కోరినట్లు తెలిపింది. గల్ఫ్ ప్రాంత భద్రత, స్థిరత్వంలో కీలక వాటా కలిగిన సమీప పొరుగు దేశంగా ఈ పరిణామాలు తమకు ఆందోళన కలిగిస్తున్నాటని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో దాదాపు కోటిమంది భారతీయులు ఉన్నారనీ వారి భద్రత, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించింది. భారతదేశ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులు ఈ ప్రాంతంపై ఆధారపడి ఉన్నాయన్న విదేశాంగశాఖ ఇక్కడి అంతరాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాలను చూపుతాయని తెలిపింది. వాణిజ్య ఓడలపై దాడులను ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురు భారతీయులు మృతిచెందారని వివరించింది. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో కొందరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు కనిపించకుండా పోయారని విచారం వ్యక్తం చేసింది.

అటు పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై విదేశాంగ శాఖ కూడా తీవ్ర ఆందోళ వ్యక్తం చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి దిగజారడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చడంతో పాటు ఇతర దేశాలకు కూడా విస్తరించిందని తెలిపారు. విధ్వంసం, ప్రాణనష్టం పెరుగుతుండగా సాధారణ జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు పెరగకుండా నివారించాలని, పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ కోరినట్లు తెలిపింది. గల్ఫ్ ప్రాంత భద్రత, స్థిరత్వంలో కీలక వాటా కలిగిన సమీప పొరుగు దేశంగా ఈ పరిణామాలు తమకు ఆందోళన కలిగిస్తున్నాటని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో దాదాపు కోటిమంది భారతీయులు ఉన్నారనీ వారి భద్రత, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించింది. భారతదేశ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులు మిగతా 2లో...



### బీజేపీ జోనల్ ప్రశిక్షణ కార్యక్రమాలు

# విజయవంతం

- రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీ మూల సిద్ధాంతాలను కేడర్‌కు బలంగా చేర్చేందుకు మండల స్థాయిలో ప్రశిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌లో భాగంగా జోనల్ వారీగా నిర్వహించిన ప్రశిక్షకుల శిక్షణా తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో చేపట్టనున్న మండల స్థాయి ప్రశిక్షణా కార్యక్రమాల పూర్వతయారీపై రాష్ట్ర ప్రశిక్షణ కమిటీతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ సంఘటిత శక్తి, సిద్ధాంత బలం, సేవా భావంతో పార్టీ బలోపేతం దిశగా కేడర్ ముందుకు సాగాలని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు ముందస్తుగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి తేదీలను ఖరారు చేయాలని ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ నూకల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోడూరి లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌ఛార్జి శివా మకుటం, గాలిపుష్పలత తదితరులు పాల్గొన్నారు.

### వేటపాలెం బాణాసంచా పేలుడుపై

# విచారణ కమిటీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి 24 మంది మరణించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రమాద ఘటనకు బాధ్యులను గుర్తించాలని జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని ఆదేశించింది.

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో టపాసులు తయారు చేస్తుండగా ఆదివారం (ఫిబ్రవరి 28వ తేదీ) పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ మంటల్లో చిక్కుకుని 23 మంది కార్మికులు సజీవదహనమయ్యారు. మిగతా 2లో...

# 'హనుమాన్'తో

## వన్యప్రాణి-మానవ సహజీవనానికి కొత్త దిశ

- మనుషులకీ వన్య ప్రాణులకీ మధ్య సంఘర్షణ నివారణకు 'హనుమాన్'
- అటు వన్యప్రాణులు, ఇటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ హనుమాన్ ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- కట్టుదిట్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- విజయవంతంగా కుంకీ ఆపరేషన్స్
- హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** 'వసుధైక కుటుంబం అనే ఉన్నతమైన సిద్ధాంతాన్ని బలంగా నమ్మే దేశం మనది. సమస్త జీవకోటి, వన్యప్రాణులు ఇందులో అంతర్భాగం. మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యత, వన్యప్రాణుల సంరక్షణ అత్యంత ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకొనే అటవీ శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ ప్రాజెక్ట్ (హీలింగ్ అండ్ నర్చూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్) ముందుకు తీసుకొచ్చామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. మిగతా 2లో...

### గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు వారికి అండగా బీజేపీ



- కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో సహాయక చర్యలు, నిరంతరం పరిస్థితులపై సమీక్ష
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ స్వయంగా పర్యవేక్షణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గల్ఫ్ దేశాల్లో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగు వారికి అవసరమైన సహాయం అందించేందుకు బీజేపీ చర్యలు చేపట్టిందని రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బీజేపీ కేంద్ర కమిటీ ద్వారా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నామని వెల్లడించారు.

గత ఐదు రోజులుగా విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి, గల్ఫ్ దేశాల్లో సహాయం కోరుతున్న వారి వినతులను సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో వేగంగా సహాయక చర్యలు తీసుకునేలా బీజేపీ జాతీయ కమిటీతో ప్రతిరోజూ టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిగతా 2లో...

## సారథి పవన్.. వారధి హనుమాన్!



- వన్యప్రాణి సంరక్షణలో సరికొత్త అధ్యాయం.. రాష్ట్రంలో "ప్రాజెక్ట్ హనుమాన్" ప్రారంభం
- మంత్రి కందుల దుర్గేష్
- వన్యప్రాణి సంరక్షణ, ప్రజల భద్రత, శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర పరిపాలన అనే నాలుగు స్తంభాలపై "హనుమాన్" కార్యక్రమం నిలుస్తుందన్న మంత్రి దుర్గేష్
- వన్యప్రాణి నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శం: మంత్రి కందుల దుర్గేష్

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** మానవ-వన్యప్రాణి సంఘర్షణలను సమర్థవంతంగా ఎదుర్కొనే లక్ష్యంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో "ప్రాజెక్ట్ హనుమాన్" (హీలింగ్ అండ్ నర్చూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్) కార్యక్రమాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఘనంగా మంగళగిరిలో ప్రారంభించారని పర్యాటక శాఖ మంత్రి, గుంటూరు జిల్లా ఇంఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మిగతా 2లో...

### ఏపీలో రైల్వే మౌలిక సదుపాయాలను

# బలోపేతం చేయండి



- రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు భేటీ

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ భేటీలో విశాఖలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభంపై కీలకంగా చర్చించినట్లు ఆయన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. మిగతా 2లో...

### ముగిసిన అరుదైన చంద్రగ్రహణం...

### తిరిగి తెరుచుకున్న శ్రీవారి ఆలయం



- ఆకాశంలో కనువిందు చేసిన సంపూర్ణ చంద్రగ్రహణం
- రక్త వర్ణంలో దర్శనమిచ్చిన చందమామ
- భారత్‌లో చంద్రోదయం తర్వాత కనిపించిన గ్రహణం
- గ్రహణం సందర్భంగా పలు ఆలయాల మూసివేత
- చంద్రగ్రహణం కారణంగా మూతపడిన తిరుమల ఆలయం
- ఆలయ శుద్ధి అనంతరం దర్శనాలు పునఃప్రారంభం

2 లో

## అవయవ దానంలో... రాష్ట్రానికి ఆరో స్థానం

- కేంద్ర ప్రభుత్వం వెల్లడి
- రాష్ట్రంలో గడిచిన 2 నెలల్లో 64 మందికి కొత్త జీవితం
- గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది
- పెరుగుతున్న స్పందన
- నిరీక్షించే 5000 మందిలో 50 ఏళ్ల లోపు ఉన్న వారే అత్యధికం
- ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరగాలి
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో జీవన్ ధాన్ కార్యకలాపాలపై సమీక్షించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అవయవాల దానశీలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ ( కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ ) రాష్ట్రాల వారీగా అవయవ దానశీ జాబితా-2025ను ప్రకటించిందని మంత్రి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు.

**పురోగతి కనిపించాలి :** ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు



జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జి జి హెచ్, కర్నూలు జిజిహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి Ai ఎం, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్-తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జి జి హెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు.

అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, మిగతా 3లో...

### రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రితో

# బీజేపీ అధ్యక్షుడు భేటీ



- అభివృద్ధి, సంక్షేమంపై సీఎంతో పీవీఎన్ మాధవ్ విస్తృత చర్చ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాల సమర్థ అమలు, పారిశ్రామిక ప్రగతి వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మిగతా 2లో...

# గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతకు ప్రాధాన్యత



(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతంపై ఆధారపడి ఉన్నాయన్న విదేశాంగశాఖ ఇక్కడి అంతరాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాలను చూపుతాయని తెలిపింది. వాణిజ్య ఓడలపై దాడులను ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురు భారతీయులు మృతిచెందారని వివరించింది. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో కొందరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు కనిపించకుండా పోయారని విచారం వ్యక్తం చేసింది.

ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే చర్చలు,దౌత్యానికి తిరిగి రావాలని భారత్ బలంగా పునరుద్ఘాటించింది. ఘర్షణకు త్వరితగతిన ముగింపు పలకాలని కోరింది. ఇప్పటికే అనేక ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం వ్యక్తం చేసింది. ప్రభావిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు అక్కడి భారతీయులతో, సంఘాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపింది. అవసరమైన సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తున్నాయని, ఘర్షణ కారణంగా చిక్కుకుపోయిన వారికి సాధ్యమైన సహాయం అందిస్తున్నాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో కూడా కాన్సులర్ సేవలను చురుకుగా కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

ఈ ప్రాంత ప్రభుత్వాలతో పాటు ఇతర కీలక భాగస్వామ్య దేశాలతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తోందని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి తమ సమకాలీనులతో చర్చలు జరిపారని వెల్లడించింది. పరిస్థితులను నిశితంగా గమనిస్తూ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తగిన నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది.

మరోవైపు పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిణామాలను నిశితంగా గమనించేందుకు అంతర మంత్రిత్వ బృందాన్ని (ఇంటర్ మినిస్టీరియల్ (గ్రూపు) కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ బృందం ప్రతిరోజూ సమావేశమై పరిస్థితులను సమీక్షిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ మంగళవారం వెల్లడించారు.

'రోజూ సమావేశమయ్యే అంతర మంత్రిత్వ బృందాన్ని ఏర్పాటు చేశాం. పశ్చిమాసియా పరిణామాలను సమీక్షిస్తూ, నౌకాశ్రయం, లాజిస్టిక్స్, ఎగుమతులు, కీలక దిగుమతుల విషయంలో ఎలాంటి బలహీనతలు ఉన్నాయో పరిశీలిస్తున్నాం. అవసరమైతే మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటాం. మంగళవారం జరిగిన తొలి సమావేశంలో వివిధ మంత్రిత్వ శాఖలు కొన్ని సూచనలు చేశాయి. వాటిపై పనిచేస్తాం. పశ్చిమాసియా సంక్షోభ ప్రభావం భారత్‌పై కనిష్ఠ స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకుంటాం. వాణిజ్య మంత్రిత్వ శాఖకు మీ విలువైన సూచనలు అందించాలని కోరుతున్నాం' అని గోయల్ పేర్కొన్నారు.

# వేట్లపాలెంలో బాణసంచా పేలుడుపై విచారణ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుడుధాటికి మృతదేహాలు.. స్థానిక పంట పొలాల్లోకి ఎగిరిపడ్డాయి.

మరో వైపు ఈ పేలుడులో తీవ్రంగా గాయపడిన లోవరాజు అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య 24కి చేరింది. ఈ ఘటనలో గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన సమయంలో టపాసుల కేంద్రంలో 70 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మరణించిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి సైతం నగదును పరిహారంగా అందజేయనున్నట్లు వెల్లడించింది.

# గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు వారికి అండగా బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసర సహాయం అవసరమైన ప్రాంతాల్లో వెంటనే స్పందించేలా చర్యలు చేపడుతున్నామని, ప్రతి విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి యుద్ధ ప్రాతిపదికన తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర నివేదికను పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసి ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా, ప్రభావితులందరికీ తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విదేశాల్లో ఎక్కడ ఉన్నా ప్రతి తెలుగు వానికి బీజేపీతో పాటు కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్ ధరలకు తక్షణ పెంపు లేదు

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్‌లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి.

**పెట్రోల్ బంకులకు పెరిగిన రష్ :** ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హార్ముజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హార్ముజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్‌లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్‌లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# 'హనుమాన్'తో వన్యప్రాణి-మానవ సహజీవనానికి కొత్త దిశ

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల కాలంలో వన్య ప్రాణుల వల్ల పంట, పశు సంపదకి నష్టంతోపాటు మానవ భద్రతకు ముప్పు కలిగించే సంఘటనలు పెరుగుతున్నందున ఈ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం ఉదయం హనుమాన్ పేరుతో 100 ప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. వీటిలో వన్య ప్రాణుల సంరక్షణతోపాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అంబులెన్స్, రెస్క్యూ వాహనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇంఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "హనుమాన్ ప్రాజెక్ట్ మానవ-వన్యప్రాణి మధ్య ఉన్న సంఘర్షణను నివారించడం, తగ్గించడం కోసం రూపకల్పన చేసిన సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమం. ఈ ప్రాజెక్టు ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ, వారి జీవనోపాధికి భద్రత కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు మరింత కట్టుదిట్టంగా ముందుకు తీసుకువెళ్లబోతున్నాం. వన్యప్రాణులను సంరక్షిస్తూనే పంటలు, పశువులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ చేపట్టేలా హనుమాన్ ప్రధాన కర్తవ్యం. ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు తక్షణ ప్రతిస్పందన, ఉపశమన చర్యలు, పరిహారం చెల్లింపు వ్యవస్థల్ని హనుమాన్ ఫౌండేషన్ నిర్వర్తిస్తుంది. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పోలీస్ శాఖలతోపాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తుంది.

**గ్రామ స్థాయిలో 'వజ్ర' బృందాలను సిద్ధం చేస్తున్నాం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా తీసుకొచ్చిన ఈ హనుమాన్ ప్రాజెక్ట్ కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించాం. అందులో 93 ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలు కాగా, మరో 7 వాహనాలు వన్యప్రాణుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అవసరమైన అంబులెన్స్ లు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్మెంట్ సెంటర్లు, 19 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచాం. ప్రతి వాహనంలో అటవీ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్య సిబ్బంది, ట్రైబల్ హెల్పర్స్ (గిరిజన), పారా వెటరేనియన్స్ తో కూడిన పూర్తి స్థాయి వ్యవస్థ ఉంటుంది. గ్రామ స్థాయిలో వన్య జీవి రక్షక్ (వజ్ర)లను అటవీ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నాం. వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నాం. గ్రామ స్థాయిలో పాములు, ఇతర జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా వారికి శిక్షణ ఇచ్చాం.

**పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాం :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ-వన్యప్రాణి సంఘర్షణలో జరిగిన నష్టానికి ఎప్పటికప్పుడు పరిహారం కూడా చెల్లించేస్తున్నాం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా కేసులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,107 వరకు నమోదు కాగా పరిహారం కింద దాదాపు రూ. 4 కోట్లు చెల్లించాం. ఇది బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందించిన భరోసా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇచ్చే ఎక్స్ గ్రేషియా, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారం మొత్తాన్ని గణనీయంగా పెంచాం. జంతువుల దాడిలో మనిషి చనిపోతే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గాయపడిన వారికి ఇచ్చే పరిహారం రూ.2 లక్షలు చేశాం. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నాం.

చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ఇప్పటి వరకు 8 ఆపరేషన్స్ విజయవంతంగా పూర్తి చేసి ఏనుగుల బారి నుంచి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించాం.

**ఏఐ సహాయంతో వన్యప్రాణుల కదలికలు:** వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. దీనిని పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రారంభించాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో జంతువుల వచ్చే ముందు ముందస్తు హెచ్చరికలు ఇచ్చే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. వన్యప్రాణుల వల్ల మానవ భద్రతకు ముప్పు కలగకుండా వశుధైక కుటుంబంలా కలిసి బతికే లక్ష్యంతో హనుమాన్ ప్రాజెక్ట్ ను తీసుకొచ్చాం. ఈ ప్రాజెక్ట్ కోసం అటవీశాఖ అధికారులు, ఫ్రంట్ లైన్ సిబ్బంది ఎంతో అంకితభావంతో కష్టపడి పని చేశారు. వారందరి సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అలాగే వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటి, ఈస్టర్న్ ఘాట్స్ కన్జర్వేషన్ సోసైటీ వంటి నిబద్ధతతో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. కలిసి జీవిద్దాం. కలిసి అభివృద్ధి చెందుదాం" అని అన్నారు.

**100కు పైగా హనుమాన్ వాహనాలకు ప్రారంభోత్సవం:** పూర్తి అధునాతన సాంకేతికతతో రూపొందించిన 100కు పైగా హనుమాన్ వాహనాలను పవన్ కళ్యాణ్ జెండా ఊపి ప్రారంభించారు. అందులో 19 ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు ఉన్నాయి. వన్యప్రాణులు గాయపడిన సందర్భాల్లో వాటిని తరలించేందుకు వీలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో వీటిని సిద్ధం చేశారు. వీటితోపాటు స్పాట్ లో చికిత్స అందించేందుకు వీలుగా ఆంబులెన్స్ లు, కాంపా వాహనాలు ఉన్నాయి. హనుమాన్ డిజిటల్ యాప్, అధునాతన సాంకేతికతతో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జి.పి.ఎస్. ట్రాకింగ్ సిస్టంను ప్రారంభించారు. అంతకు ముందు అటవీశాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది, సేవలు అందిస్తున్న ఎన్జీవోలకు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా తిలకించారు. మొదట ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు, హనుమాన్ ఆంబులెన్స్‌లను పరిశీలించి సౌకర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ పరిధిలో సంచరించే వన్యప్రాణులు వివరాలు, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రెస్క్యూ ఆపరేషన్స్ లో వినియోగించే కిట్లు, జనావాసాల్లోకి వచ్చిన పులులు లాంటి వన్య మృగాలను బంధించే బోన్లు, అటవీశాఖ పరిధిలో పెరిగే ఔషధాల మొక్కలు, ఉత్పత్తుల వివరాలను అధికారులు, ఎన్జీవోలు గ్యాలరీల రూపంలో పవన్ కళ్యాణ్‌కి వివరించారు. ఈస్టర్న్ ఘాట్స్ లో సంచరించే కింగ్ కోబ్రా తదితర పాముల వివరాలు తెలియజేస్తూ ఇచ్చిన ప్రజంటేషన్ ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు పి. మల్లికార్జునరావు, అటవీశాఖ ఐటీ సలహాదారు పి. నాగేశ్వరరావు, అటవీశాఖ సలహాదారు అంకారావు, రాష్ట్ర మెడికల్ డెవలప్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా, 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అరుదైన చంద్రగ్రహణం... తిరిగి తెరుచుకున్న శ్రీవారి ఆలయం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆకాశంలో ఓ అద్భుత ఖగోళ దృశ్యం కనువిందు చేసింది. ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రపంచవ్యాప్తంగా వీక్షకులను అలరించింది. భూమి నీడ చంద్రుడిపై పడటంతో, జాబిల్లి పూర్తి ఎర్ర రంగులోకి మారి 'బ్లడ్ మూన్' (రక్త చంద్రుడు)గా దర్శనమిచ్చింది. భారత్‌లోనూ ఈ చంద్రగ్రహణం పలు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది.



భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:20 గంటల తర్వాత గ్రహణం ప్రారంభమైనప్పటికీ, ఆ సమయంలో చంద్రుడు దిగంతానికి దిగువన ఉండటంతో మన దేశంలో కనిపించలేదు. సాయంత్రం 6:26 గంటలకు చంద్రోదయం తర్వాతే గ్రహణాన్ని వీక్షించే అవకాశం లభించింది. ముఖ్యంగా సాయంత్రం 6:33 నుంచి 6:40 గంటల మధ్యలో గ్రహణం గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, చంద్రుడు తూర్పు దిక్కున ఎర్రని నారింజ రంగులో అద్భుతంగా కనిపించాడు. రాత్రి 6:47 గంటలకు గ్రహణం పూర్తిగా ముగిసింది.

దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాలైన ఇండోర్ వంటి నగరాల్లో చంద్రోదయం సమయంలోనే గ్రహణం గరిష్ఠ దశలో ఉండటంతో, ప్రజలు ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించారు. ఈ ఖగోళ వింతను చూడటానికి ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకపోయింది.

చంద్రగ్రహణం సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సంప్రదాయాల ప్రకారం 'సూతక్ కాలం' పాటించారు. ఉదయం గ్రహణం ప్రారంభానికి ముందే సూతక్ మొదలై, సాయంత్రం 6:47 గంటలకు గ్రహణం ముగిశాక పూర్తయింది. ఈ సమయంలో చాలామంది శుభకార్యాలకు దూరంగా ఉండి, ఉపవాసాలు పాటించారు. తిరుపతి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆలయాలను మూసివేశారు.

సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం ఏర్పడుతుంది. మళ్లీ ఇటువంటి సంపూర్ణ చంద్రగ్రహణం 2028 చివరి వరకు కనిపించదని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో ఈ అరుదైన దృశ్యాన్ని చాలా మంది తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

**చంద్రగ్రహణం అనంతరం తెరుచుకున్న తిరుమల.. శ్రీవారి దర్శనాలు పునఃప్రారంభం :** చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం మూసివేసిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ ద్వారాలు రాత్రి తిరిగి తెరుచుకున్నాయి. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కైంకర్యాలు పూర్తి చేసి రాత్రి 8 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

మంగళవారం మధ్యాహ్నం 3:26 గంటల నుంచి సాయంత్రం 6:47 గంటల వరకు చంద్రగ్రహణం కొనసాగింది. ఆగమశాస్త్ర నియమాల ప్రకారం, గ్రహణానికి ఆరు గంటల ముందుగానే అంటే ఉదయం 9 గంటలకే ఆలయ తలుపులను మూసివేశారు. గ్రహణం పూర్తయిన తర్వాత రాత్రి 7:30 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి, శుద్ధి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భక్తుల దర్శనాలతో పాటు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాద వితరణ కూడా తిరిగి ప్రారంభమైంది. రాత్రి 8:30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అదేవిధంగా, లడ్డూ విక్రయ కౌంటర్లను కూడా తెరిచి భక్తులకు అందుబాటులో ఉంచారు. దీంతో గ్రహణం కారణంగా రోజంతా శ్రీవారి దర్శనానికి దూరమైన భక్తులు రాత్రి నుంచి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

# ఏపీలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం జిల్లాలో రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతం, శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్, తిరుపతి నగరాలకు డైరెక్ట్ రైళ్లను నడపడంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే ధోలేరా అంతర్జాతీయ విమానాశ్రయం పురోగతి పై కూడా అశ్వినీ వైష్ణవ్ తో చర్చించామని పేర్కొన్నారు. మందస రోడ్, పాతపట్నం, హరిశ్చంద్రపురం స్టేషన్లలో కీలక రైలు నిలుపుదలలు, కామేశ్వరీపేట హాల్ట్ స్టేషన్ అభివృద్ధి, ఎన్‌హెచ్-16 పక్కన ఉన్న హరిశ్చంద్రపురం స్టేషన్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలపై కూడా సుదీర్ఘంగా చర్చించామని, కొత్త ROB\T/RUBలు, స్టేషన్ లలో ప్రయాణికుల సౌకర్యాలపై కూడా ప్రతిపాదనలు అందించామని వెల్లడించారు. మంత్రితో కలసి కంట్రోల్ రూమ్ లో పనితీరును సమీక్షిస్తూ, ప్రయాణికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు రామ్మోహన్ తెలిపారు. ధోలేరా అభివృద్ధికి అనుగుణంగా రైల్వే మౌలిక వసతులను సమన్వయం చేస్తూ, భవిష్యత్ విస్తరణకు అనుకూలంగా ఎయిర్-రైల్ కనెక్టివిటీపై కూడా చర్చించామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు, సమగ్ర మల్టీ-మోడల్ కనెక్టివిటీ ద్వారా దేశ నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి తామెప్పుడూ కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రితో బీజేపీ అధ్యక్షుడు భేటీ



(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ విస్తృతంగా చర్చించారు. అమరావతిలో జరిగిన ఈ భేటీ దాదాపు గంటకు పైగా కొనసాగినట్లు సమాచారం.

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే విధంగా పారిశ్రామిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త పరిశ్రమలకు అనుకూల విధానాలు రూపొందించడం, యువతకు ఉపాధి అవకాశాలను పెంచడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాల్లో పెట్టుబడులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం మరింత పెంపొందించాల్సిన అవసరాన్ని మాధవ్ ప్రస్తావించినట్లు సమాచారం.

ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, పోర్టుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆర్థిక స్థితి బలోపేతం, ఆదాయ వనరుల విస్తరణ, పారదర్శక పాలన వంటి అంశాలపై కూడా ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

ప్రజాసంక్షేమ పథకాల అమలులో లక్ష్యిత లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేరేలా వ్యవస్థను బలోపేతం చేయాలని మాధవ్ సూచించినట్లు సమాచారం. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, స్వయం ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చలో ప్రస్తావించారని తెలిసింది.

రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం బలమైన అడుగులు వేయాలని, కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయంతో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమని భేటీలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీ పూర్తి సహకారం అందిస్తుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేసినట్లు సమాచారం.

# సారథి పవన్.. వారథి హనుమాన్!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం మంగళగిరి ఏపీఎస్పీ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... వన్యప్రాణి సంరక్షణా దినోత్సవం సందర్భంగా "హనుమాన్" కార్యక్రమం ప్రారంభం కావటం శుభసూచకమన్నారు. వన్యప్రాణి సంరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అమృత హస్తాలతో "హనుమాన్" అనే వినూత్న వన్యప్రాణి సంరక్షణ మరియు ఘర్షణ నివారణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అటవీ శాఖ వినూత్న కార్యక్రమాలకు వేదికవుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఏనుగుల నుంచి పంట, ప్రాణ నష్టాలను కాపాడేందుకు కర్నాటక నుంచి తెచ్చిన కుంకీ ఏనుగుల నిర్వహణ, శేషాచలం అడవుల్లో ఎర్రచందనం సంరక్షణ చర్యలు, రాజమహేంద్రవరంలో అటవీ పరిశోధన సంస్థ కార్యక్రమాలు వంటి అనేక చర్యల ద్వారా అటవీ శాఖ ప్రజలకు చేరువ చేసిన ఘనత ఉపముఖ్యమంత్రి వారిదేనని పేర్కొన్నారు. మానవ-వన్యప్రాణి ఘర్షణ తగ్గింపే లక్ష్యం మానవ జీవన విధానం, వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘర్షణలను తగ్గించడానికి శాస్త్ర సాంకేతిక ఆధారిత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.







వన్యప్రాణుల వల్ల పంటలు, ఆస్తులకు కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు, అదే సమయంలో వన్యప్రాణుల సంరక్షణను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. "హనుమాన్" కార్యక్రమం ద్వారా వన్యప్రాణులను జనసంచారం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రజల ప్రాణాలు, పంటలు, ఆస్తులను రక్షించడం వేగవంతమైన రెస్క్యూ ట రిలీఫ్ చర్యలు చేపట్టడం అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమం కేవలం అటవీ శాఖకే పరిమితం కాదని, వ్యవసాయ, పశుసంవర్ధక, పర్యాటక మరియు ఇతర లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమం విజయవంతం కాదని, స్థానిక సమాజం మరియు స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములుగా చేసుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజల్లో చైతన్యం అవసరం అని, మానవులు, వన్యప్రాణులు ఒకరినొకరు భయపడే పరిస్థితి రాకుండా, పరస్పర అవగాహనతో సహజీవనం చేయాలనే భావనను "హనుమాన్" కార్యక్రమం బలపరుస్తుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనల నుంచి పుట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతుందన్నారు. వన్యప్రాణి సంరక్షణ, ప్రజల భద్రత, శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర పరిపాలన అనే నాలుగు స్తంభాలపై "హనుమాన్" కార్యక్రమం నిలుస్తుందని, ఇది రాష్ట్రాన్ని వన్యప్రాణి నిర్వహణలో దేశానికి ఆదర్శంగా నిలబెడుతుందని మంత్రి కందుల దుర్గేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# బీసీ సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది




- ఉద్యోగుల ఐక్యతే సమాజ అభివృద్ధికి పునాది
- నిబద్ధత, సేవాభావంతో పనిచేసి యువతకు ఆదర్శంగా నిలవండి
- ఏపీ యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు పిలుపు
- నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పల్లా శ్రీనివాస్ రావు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఈ రోజు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించబడింది. అమరావతిలో ఏపీ యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి నూతన భవన నిర్మాణం కోసం 30 సెంట్లు భూమి కేటాయించాలంటూ పల్లా శ్రీనివాస్ రావుకు సొసైటీ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఉద్యోగ స్థాయిలో మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమానంగా నిర్వర్తించడం ప్రతి ఉద్యోగి కర్తవ్యమని అన్నారు. సమాజ సమగ్రాభివృద్ధి కోసం ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం అత్యంత అవసరమని సూచించారు. యువతకు మార్గనిర్దేశనం చేస్తూ విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవల్లో ఉన్న యాదవ ఉద్యోగులు పారదర్శకత, నిజాయితీ, సేవాభావంతో పనిచేస్తే సమాజానికి గౌరవం పెరుగుతుందని తెలిపారు. సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ప్రతిభా పురస్కారాలు నిర్వహించడం ద్వారా కొత్త తరం ఉద్యోగులను ప్రోత్సహించాలని సూచించారు. బీసీల అభ్యున్నత, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో APYES ఫౌండర్ & రాష్ట్ర అధ్యక్షులు దామినబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి కావేటి రమేష్ యాదవ్, సెక్రటేరియట్ ఎంప్లాయిస్ పెద్దలు డా.అప్పారావు, రాఘవరావు, వివిధ శాఖల ఉద్యోగులు షణ్ముఖ రావు, భాస్కర్, రజనీకాంత్, లక్ష్మణ కుమార్, రమేష్, రామకృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వేట్లపాలెం ఘటనలో మరో మరణం.. 23కి చేరిన మృతుల సంఖ్య



**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్)** : కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఫిబ్రవరి 28న జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనలో మరో మరణం చోటు చేసుకుంది. బాణసంచా పేలుడులో తీవ్రంగా గాయపడి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వేమగిరి లోవరాజు (38) పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందారు. దీంతో, మృతుల సంఖ్య 23కు చేరింది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లోవరాజుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఘటన జరిగిన రోజు 20 మంది సజీవ దహనమయ్యారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఈ నెల 1న ఇద్దరు, మంగళవారం ఒకరు మృతి చెందారు. ఆరుగురు కాకినాడ జిజిహెచ్, మరొకరు సామర్లకోట సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. జిజిహెచ్‌లోని ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

**దిక్కులేనివారమయ్యాం ...:** ఇంటి యజమాని మృతితో తామంతా దిక్కులేని వారమయ్యామని లోవరాజు భార్య బుజ్జి కన్నీరుమున్నీరైంది. తన పిల్లలతో కలిసి కాకినాడ జిజిహెచ్‌కు వచ్చిన ఆమె భర్త మరణంతో గుండెలవిసేలా రోదించింది. తండ్రి కోసం పిల్లలు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. లోవరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆర్థికంగా భరోసా ఇవ్వడంతో పాటూ ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బంధువులు విజ్ఞప్తి చేశారు.

# కాకుమాను పి హెచ్ సీ ఏ సురక్షిత కాన్పులు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** మండల కేంద్రం అయిన కాకుమాను ప్రాథమిక వైద్య శాల నందు సురక్షితంగా కాన్పులు చేస్తూ ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజలకు నమ్మకం మరింతగా పెంచుతున్నారు. పి హెచ్ సి వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్ స్థానికంగా నివాసముంటూ ప్రజలకు సకాలంలో వైద్య సేవాలందిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యధికారి డా. స్వర్ణ రాజశేఖర్ మాట్లాడుతూ కొమ్మూరు గ్రామానికి చెందిన గర్భిణీ కు పురిటి నొప్పులు రావడంతో కాకుమాను వైద్యశాల నందు సురక్షితంగా కాన్పు చేసినట్లు తెలిపారు. పాప జన్మించినట్లు తెలిపారు. పాప 2.6 కేజీ ల బరువుతో ఆరోగ్యంగా ఉందన్నారు. తల్లి బిడ్డ ఇరువురు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. గతంలో కాన్పు లకు ప్రయివేట్ వైద్యశాలలు సూదూర ప్రాంతలకు వెళ్ళేవారు కానీ ప్రభుత్వ వైద్యశాల లో అత్యాధునిక వైద్య పరికరాలు అనుభవఘ్నులైన వైద్య సిబ్బందితో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న ట్లు తెలిపారు. ఉన్నతధికారుల సూచనలు పాటిస్తూ క్షేత్ర స్థాయిలో సిబ్బందిని సమన్వయము చేసుకుంటూ అనారోగ్య సమస్యలు, గర్భిణీలు పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలియజేసారు. వైద్య సిబ్బంది ప్రజల సహకారం తో కాకుమాను పి హెచ్ సి నందు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలియజేసారు. ఎంతో విలువైన వైద్య సేవలను ప్రభుత్వ వైద్యశాల లో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలో అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని సమీప గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలు తో బాధపడేవారు ప్రభుత్వ వైద్య శాల నందు లేదా గ్రామ వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలియజేసారు.

# అవయవ దానంలో... రాష్ట్రానికి ఆరో స్థానం

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు.

**ఇప్పటివరకు..:** విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధుకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.

**పెరుగుతున్న ఔదార్యం :** రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు.. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు.



ఈ ఏడాది మరింతగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించి అవయవాలు కోసం ఎదురుచూస్తున్న బాధితులకు భరోసా కల్పించేందుకు కృషి చెయ్యాలని జీవన్ దాన్ సమన్వయకర్తలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు మంత్రి సూచించారు.

**1,200 మంది బాధితులకు నూతన జీవితాలు... :** రాష్ట్రంలో అవయవాలు ఆయుష్షు నిండి ఎదురుచూస్తున్న 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..

**అవయవాల కోసం 5,000 మంది ఎదురుచూపులు :** రాష్ట్రంలో 20-50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం గమనార్హం. ఉత్పాదక వయసులోనే అవయవ వైఫల్యంతో చిక్కిశల్యమవుతుండటంతో వారి వ్యక్తిగత జీవితంలోనే గాక సామాజికంగానూ తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0-09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

**కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం:** బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయి. అలాగే 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ. లక్ష వరకు పెంచే విషయ ప్రభుత్వం పరిశీలనలో ఉందని తెలిపారు.

# జిల్లా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ మహాధర్నాలు విజయవంతం!

- సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర స్థాయి ఆందోళనకు సిద్ధం!!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : విద్యారంగ, ఉపాధ్యాయుల మరియు ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ అసెంబ్లీలో లేదా ముఖ్యమంత్రి దృష్టికి ఎవరు తీసుకెళ్లలేదని అందుకే నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ మహా ధర్నాలను నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. మహాధర్నా కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని, ఇప్పటికి సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్రస్థాయి ఆందోళన కార్యక్రమానికి సిద్ధపడతామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు యస్. చిరంజీవి తెలిపారు.

ఏ పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు కర్నూలు, నంద్యాల జిల్లాలు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏ.సదాశివరావు విజయనగరం జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నెల్లూరు జిల్లా, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ కృష్ణా జిల్లా మహా ధర్నా ల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

ఏపీటీఎఫ్ పోరుబాట - మహాధర్నా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని,



30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1/7/2024 నుండి పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఏ ల, కిస్తీలను విడుదల చేయాలని 1/7/ 2018 నుండి చెల్లించవలసిన డి.ఏ బకాయిలను, 11వ పిఆర్సి బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయితీరాజ్ శాఖ లో మరణించిన టీచర్ల బిడ్డలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉపాధ్యాయులకు బోధన తప్ప బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయించాలని, రిటైర్ అయిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ ,లీవ్ ఎన్కాష్మెంటు తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

హై స్కూల్ ప్లస్ లలో ఖాళీలను విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా తక్షణం భర్తీ చేయాలని, గురుకులాలు, సొసైటీస్ , మీూ టీచర్లకు ఉద్యోగ విరమణ వయసును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని వారి సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్‌ను అమలు చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులను జునూ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు కోసం కమిటి ని నియమించాలని , 57 మెమోను అమలు చేసి ద్వారా జి. వో ను జారీ చేయాలని, మున్సిపల్ , కె జి బి వి , మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలపై విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి సమర్పించిన అన్ని సమస్యలను పరిష్కారం చేయాలని ధర్నాల్లో డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుచున్న బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ కేటాయించాల్సిన వాటికి కేటాయించాలని అన్నారు లేదంటే రాష్ట్ర స్థాయి ఆందోళనకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ముస్లింలకు పవిత్రం రంజాన్



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):**ముస్లిం లు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల.ఈ నెల ప్రారంభం నుండి
వారు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు చేస్తూ కఠిన నియమాలను పాటిస్తూ ఉంటారు. ఇది ఇస్లామిక్ క్యాలెం
డర్ లో తొమ్మిదవ నెల. రంజాన్ నెలలో ముస్లింలు ఉపవాసం ఉంటారు, ప్రార్థనలు చేస్తారు, దానధర్మాలు
చేస్తారు. ఈ నెలలో ఖురాన్ అవతరించిందని ముస్లింలు నమ్ముతారు.

**రంజాన్‌నెల ప్రాముఖ్యత :** ఉపవాస రంజాన్‌నెలలో సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఆహారం,నీరు తీసుకోకుండా ఉపవాసం ఉంటారు. ఉపవాసం స్వీయ నియంత్రణ, ఓర్పు, దేవుని పట్ల భక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. ఇది పేదవారి ఆకలి బాధను అర్థం చేసుకోవడానికి, వారి పట్ల కరుణ చూపడానికి సహాయపడుతుంది.

**నమాజ్ ప్రార్థనలు :** రంజాన్ నెలలో ముస్లింలు ఎక్కువ సమయం ప్రార్థనలు చేస్తారు. ఖురాన్ పఠనం, తరావీహ్ వంటి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇవి దేవునితో అనుబంధాన్ని పెంచుకోవడానికి,



ఆధ్యాత్మికంగా బలపడటానికి సహాయపడతాయి.

**దానధర్మాలు (జకాత్) :** రంజాన్ నెలలో పేదవారికి, అవసరమైన వారికి దానధర్మాలు చేయడం చాలా ముఖ్యం జకాత్ అనేది ఇస్లాంలోని ఐదు మూలస్తంభాలలో ఒకటి. ఇది సమాజంలో పేదరికాన్ని తగ్గించడానికి, సమానత్వాన్ని పెంపొందించడానికి సహాయ పడుతుంది.

**ఖురాన్ అవతరణ :** ఖురాన్ ఈ నెలలోనే అవతరించిందని ముస్లింలు నమ్ముతారు. ఈ నెలలో ఖురాన్ పఠనం, అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. ఖురాన్ మానవాళికి మార్గదర్శకంగా భావిస్తారు.

**దానధర్మాలు :** దానధర్మాలు చేయడం ద్వారా పేదవారికి సహాయం చేయవచ్చు. ఇది సమాజంలో పేదరికాన్నితగ్గించడానికి సహాయ పడుతుంది. దానం చేయడం ద్వారా దేవుని అనుగ్రహం పొందవచ్చు. సమానత్వాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది. రంజాన్ నెలఆధ్యాత్మికంగా చాలా ముఖ్యమైనది. ఇది స్వీయ నియంత్రణ, దాతృత్వం,దేవుని పట్ల భక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది.

**రంజాన్ నెల శుభాకాంక్షలు :** ముస్లిం ప్రజలకు రంజాన్ నెల సందర్భంగా బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెలలో కఠోర ఉపవాసం చేస్తున్న వారిపై అల్లాహ్ దయ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణం లో పండుగను జరుపుకోవాలని కోరారు.

# యుఎఇ నుంచి భారత్‌కు తొలి విమానం

- స్వస్థలాలకు 149 మంది

**న్యూఢిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ):** అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంతో పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొనడంతో యుఎఇ నుంచి భారత్‌కు తొలి విమానం చేరుకుంది. దుబారు నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ916డి మంగళవారం ఉదయం 10:58 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంది. విటి-ఇడిసిగా నమోదైన ఈ విమానం మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న పరిస్థితుల మధ్య భారత ప్రయాణీకులను స్వదేశానికి తీసుకొచ్చిన తొలి విమానంగా గుర్తింపు పొందింది. ఈ విమానం ద్వారా 149 మంది ప్రయాణీకులు స్వస్థలాలకు చేరుకున్నారు. ఈ విమానంతో పాటు కేవలం దుబారులో చిక్కుకుపోయిన తమ సిబ్బంది కోసం ఎయిర్ ఇండియా మరో విమానాన్ని నడిపింది. ఈ విమానం కూడా మంగళవారం ఉదయమే ఢిల్లీకి చేరుకుంది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 143 మంది కాక్‌పిట్, క్యాబిన్ సిబ్బంది దుబారు నుంచి ఎఐ1918డి విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు పశ్చిమాసియాకు వెళ్లవలసిన విమాన సర్వీసుల రద్దు మంగళవారం కూడా కొనసాగింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సుమారు 70 సర్వీసులను రద్దు చేశారు. బెంగళూరు నుంచి 44, కొల్‌కతా నుంచి 10 సర్వీసులను రద్దు చేశారు.

**నేడు 58 ప్రత్యేక సర్వీసులు :** పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకునిరావడానికి బుధవారం 58 ప్రత్యేక విమాన సర్వీసులను నడపనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రికత్తల కారణంగా సోమవారం భారతీయ, విదేశీ విమానయాన సంస్థలు మొత్తంగా 1,609 సర్వీసులను రద్దు చేసినట్లు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సోమవారం ఈ ప్రాంతం నుంచి భారతీయ విమానయాన సంస్థలు మొత్తంగా 24 విమాన సర్వీసులు నడిపాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. అదనంగా విదేశీ విమానయాన సంస్థలు గల్ఫ్ ప్రాంతం నుంచి తొమ్మిది విమానాలను నడిపాయని తెలిపింది. బుధవారం భారతీయ సంస్థలు 58 సర్వీసులకు ప్రణాళిక సిద్ధం చేశాయని, ఇందులో ఇండిగో 30, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లు 23 సర్వీసులు నడపనున్నాయని తెలిపింది. టిక్కెట్ల ధరల్లో అనవసరమైన పెరుగుదల లేకుండా విమాన ఛార్జీలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు కూడా విమానయాన శాఖ తెలిపింది.



**నేను ఇంటికి తిరిగి వచ్చాను: పివి సింధు :** గగనతలం మూసివేయడంతో దుబారులో చిక్కుకుపోయిన ఒలింపిక్ పతక విజేత భారత బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు, బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ ముగించుకుని దేశానికి తిరిగి వచ్చారు. "అద్భుతమైన గ్రౌండ్ జట్లు, దుబారు అధికారులు, విమానాశ్రయ సిబ్బంది, ఇమ్మిగ్రేషన్ సిబ్బంది చాలా క్లిష్ట సమయంలో మమ్మల్ని బాగా చూసుకున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. సానుభూతి, వృత్తి నైపుణ్యం గురించి చెప్పలేనివి" అని పివి సింధు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "బెంగళూరులోని ఇంటికి తిరిగి వచ్చాను, సురక్షితంగా ఉన్నాను. గత కొన్ని రోజులు తీవ్రంగా, అనిశ్చితంగా ఉంది, కానీ నా ఇంటికి తిరిగి వచ్చినందుకు నేను నిజంగా సంతోషంగా ఉన్నాను" అని ఆమె పోస్ట్‌లో తెలిపారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేక మహోత్సవం



- మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం

**ఉండవల్లి(జర్నలిస్ట్ ఫైల్)** : విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరిగే కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. 8వ తేదీన అభిషేకం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కే శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన నిర్వహణకు లక్ష విరాళం



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం8 వ తరం 12 వ పీఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామివారి పట్టాభిషేకమునకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆర్యవైశ్య సభ వారిచే నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమమునకు (70 బస్తాల బియ్యం) లక్ష రూపాయల విరాళాలు సేకరించి ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్‌బాబు ఆధ్వర్యంలో మఠాధిపతి సోదరులు దత్తాత్రేయ స్వామి మరియు బామ్మర్ది పిపిఎన్ ప్రసాద్ కి స్వామివారి ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సభ అధ్యక్షులు మరియు కమిటీ మెంబర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

# చంద్రబాబు, పవన్ భేటీ



- మండలిలో వైసిపిని ఎదుర్కోవడమే ఎజెండా!

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం ఉండవల్లిలోని సిఎం నివాసంలో ప్రత్యేకంగా సమావేశం కావడం చర్చనీయాంశమైంది. పంచాయతీరాజ్, అటవీశాఖల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటికి నిధుల కేటాయింపులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై చర్చించేందుకే చంద్రబాబును పవన్ కలిశారని పైకి చెబుతున్నప్పటికీ అసెంబ్లీ సమావేశాల్లో కూటమి అనుసరించాల్సిన వ్యూహంపైనే ప్రధానంగా ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. తిరుపతి లడ్డూపై చర్చించాలని శాసనమండలిలో ప్రతిపక్ష వైసిపి పట్టుబట్టింది. కొన్ని రోజులుగా ఆందోళనలతో సభ జరగనీయకుండా అడ్డుకుంటోంది.

ప్రభుత్వం చర్చకు సిద్ధం అంటూనే దాటవేతకు దిగుతోందని ఆరోపిస్తోంది. మార్చి 4న మండలిలో చర్చ చేపడతామని సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల వెల్లడించారు. నాలుగు రోజుల విరామం అనంతరం బుధవారం శాసనసభ, మండలి సమావేశమవుతున్నాయి. ఈ కేంద్రంగానే సిఎం, పవన్ మధ్య చర్చ నడిచిందని తెలిసింది. కాగా వారిద్దరి భేటీపై ప్రభుత్వ ప్రకటన మరోలా ఉంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రికి పవన్ వివరించారని అధికారికంగా పేర్కొన్నారు. జల్‌జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధి, నిధుల కేటాయింపు, నియోజకవర్గాల వారీ చేసిన కేటాయింపులు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల పనుల గురించి పవన్ వివరించారని తెలిపారు. నీటిపారుదలశాఖ పరిధిలోని డ్రెయినేజీల్లో వేసవిలో పూడిక తీత పనులు చేపట్టి రైతులు పంటలు వేసేలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎంను కోరినట్లు పేర్కొన్నారు.



## జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన కంభం విజయరాజు

**ఇబ్రహీంపట్నం, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను చింతలపూడి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరాజు పరామర్శించారు. ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన ఇంటిపై జరిగిన దాడి ఘటనను జోగి రమేష్ దృశ్యాల ద్వారా వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కంభం విజయరాజు, జోగి రమేష్ పట్ల కూటమి ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించిందని ఆరోపించారు. 83 రోజుల పాటు జోగి రమేష్‌ను అక్రమంగా కారాగారంలో ఉంచడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ఆగకుండా ఆయన నివాసంపై పోలీసుల సహకారంతో ఆమ్ల బాంబులతో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని అన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కివేయడం సరైన పరిపాలన కాదని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ వ్యవహారాలను గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని తెలిపారు. ఇటువంటి చర్యలను వెంటనే మానుకోవాలని కంభం విజయరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**గన్నవరం, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

మాదిగల అభ్యున్నతికి తగిన సహకారం అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ఆదివారం గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీ ఎస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని మాదిగల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వినతి పత్రం రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సమస్యలకు తగిన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇంచార్జ్ మంద వేణు మాదిగ, కో-ఇంచార్జ్ కొప్పుల కామేశ్వరరావు మాదిగ, ఉంగుటూరు మండలం అధ్యక్షులు పులపాక పాస్కల్ మాదిగ, విజయవాడ రూరల్ మండలం అధ్యక్షులు కొక్కిలిగడ్డ కమల్ రాజు మాదిగ, టీడీపీ గన్నవరం నియోజకవర్గ లీగల్ చైర్మన్ తగరం కిరణ్ బాబు, సూరంపల్లి మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమరవల్లి ప్రసాద్, బొకినేల తిరుపతిరావు, కొంద్రు దాసు, వంగూరి మరియుదాసు, నందేటి తిరుపతిరావు, కొమ్ము సుదర్శనం, కోడలి సుమన్, కోట బాబూరావు, పైడిముక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో క్రికెట్ & ఫిట్ నెస్ విభాగాలలో ఉచిత సమ్మర్ క్యాంపు



**మైలవరం, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

స్థానిక లక్కిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ లో ఫ్రీ సమ్మర్ క్యాంపు.క్రికెట్ & ఫిట్ నెస్ విభాగాలలో కోచింగ్ క్యాంపు ని ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అనుబందంగా ఈ నెల 16 నుండి ఉచితంగా శిక్షణను ఇచ్చుటకు ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ,ప్రెసిడెంట్ .జి.శ్రీనివాస రెడ్డి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కోచింగ్ లో భాగంగా క్రికెట్ మరియు ఫిట్నెస్ లో అన్ని వయసుల వారికి శిక్షణ, బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది ఈ శిక్షణ 25 సంవత్స రాలు అనుభవం ఉన్న డా. రాజ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి మరియు ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వారి పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మైలవరం మరియు చుట్టుపక్కల ప్రాంతాలవారు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాలు చేయుటలో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ మానేజ్మెంట్ ఎల్లవేళలా ముందుంటుందని ఈ సందర్బంగా తెలియచేసారు.. ఈ ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశం అందరు ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యంతోనే ఏదైనా సాధించవచ్చని అన్నారు . ఈ శిక్షణలో పాల్గొనుటకు ఆశక్తి కలిగిన వారు ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ కే . స్వామి- 8142143653 సంప్రదించాలని కోరారు.

## సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయశీ మూసివేత

**ఆగిరిపల్లి, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**



మంగళవారం ఏర్పడనున్న సంపూర్ణ చంద్రగ్రహణాన్ని దృష్టిలో ఉంచుకుని ఆగిరి పల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల ఆలయంను ఉదయం 10 గంటల నుంచి మూసివేస్తామని కార్యని ర్వహణాధికారి సిహెచ్ సాయి వెల్లడించారు. గ్రహణానికి ముందు నిత్యపూ జలు నిర్వహిం చి, అనంతరం ఆలయ ద్వారాల ను మూసివేయనున్నట్లు తెలిపారు. గ్రహణం అనంతరం బుధవారం సంప్రోక్షణ కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత భక్తులకు దర్శనా లు తిరిగి ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు ఆలయ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా పార్టీ కోసం చివరి శ్వాస వరకు

# పోరాడిన ధీశాలి నేత బచ్చుల అర్జునుడు 3వ వర్ధంతి

**గన్నవరం, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు 3వ వర్ధంతి సందర్భంగా గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు ఉదయం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన స్మారక సభలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడుతూ ఆయన రాజకీయ ప్రస్థానాన్ని స్మరించారు. 2014లో కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షుడిగా, 2017లో ఎమ్మెల్సీగా, 2020లో పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత పార్టీకి ఆదర్శమని తెలిపారు. ప్రతిపక్షంలో పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో గన్నవరం నియోజకవర్గంలో పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తలకు ధైర్యం నూరిపోసిన నాయ కుడు బచ్చుల అర్జునుడనే పేర్కొన్నారు. 2020 నుండి 2023 వరకు నియోజకవర్గ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేశారని కొనియాడారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిం చడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో, వారికి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలను నెరవేర్చ డం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్ల వుతుందని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడి పి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, గన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, టిడిపి జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ సుధాకర్, గన్నవరం మండల బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర టిఎన్ టియుసి కార్యదర్శి బుస్సే నాగప్రసాద్, నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు వేదేపల్లి రమ, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చల్లగుళ్ళ సందీప్, గన్నవరం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బుస్సే సరిత, గన్నవరం మండల తెలుగుయువత అధ్యక్షులు నందిపాముల పృథ్వీ, జిల్లా విజిలెన్స్ బోర్డు డైరెక్టర్ తిరువీధి నరేష్, టిడిపి నాయకులు సొంగా సంతోష్, కంచర్ల సూర్యప్రకాష్, కొండేటి నాగరాజు, నిమ్మకూరి మధు, ఆరిఫ్ పఠాన్, యెల్లా రఘు, చల్లగుళ్ళ సుమంత్, గుత్తా జయేంద్ర, రాహుల్, జయంత్, జయరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత

- మహిళ భద్రత సమాజ భద్రతకు మూలస్తంభంలి
- ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలి
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబుదే : హోం మంత్రి అనిత
- ఘనంగా విజయవాడలో మహిళా భద్రత వారోత్సవాలు
- సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ



**విజయవాడ, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

మహిళా భద్రత వారోత్సవాల సందర్భంగా విజయవాడ సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఐజి రాజకుమారి, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎస్పీ సరిత, ఈగల్ ఎస్పీ నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో మహిళా భద్రతపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత 'శక్తి టీమ్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గినట్లు వెల్లడించారు.ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, మహిళ సాధికారత సాధిస్తే కుటుంబం మొత్తం సాధికారత సాధించినట్లేనని చెప్పారు. మహిళ భద్రత సమాజ భద్రతకు మూలస్తంభమని, మహిళా అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానమని పేర్కొన్నారు.ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని, ఆడపిల్లలతో పాటు మగపిల్లలను కూడా బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి ఆడపిల్లను తల్లి, సోదరి భావనతో గౌరవించాలని, మహిళల పట్ల గౌరవం ఇంటి నుంచే ప్రారంభమవ్వాలని అన్నారు. పిల్లలకు కోట్ల ఆస్తి కంటే సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, పరిష్కార శక్తి ఇవ్వడం ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఒక తల్లి ప్రసవ వేదనను మాటల్లో చెప్పలేమని, మహిళల శక్తి అపారమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్త్రీల పక్షపాతిగా ఉన్నారని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆస్తుల్లో మహిళలకు సమాన వాటా తీసుకువచ్చినది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు అని గుర్తుచేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై 'సెక్సువల్ అఫెండర్ షీట్' ఓపెన్ చేసి, కఠిన నిఘా ఏర్పాటు చేస్తామని హోం మంత్రి స్పష్టం చేశారు. మహిళలను గౌరవిస్తూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



## విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత సీట్లు భర్తీ చేయాలి

**ఆగిరిపల్లి, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల్లో పేద, ఎస్సీ, ఎస్టీ తదితర అర్హ విద్యార్థులకు విద్యాహక్కు చట్టం--2009 ప్రకారం 25 శాతం ఉచిత సీట్ల భర్తీ విషయంలో నిర్లక్ష్యం తగదని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు జిల్లా అధికారులను కోరారు.ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసి ప్రతి మండల విద్యాశాఖ కార్యాలయం, స్వర్ణ గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అధికారులు ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంస్థ ప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లికి చెందిన వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు, సయ్యద్ మీర్జాఫర్ అలీ, సయ్యద్ లాల్ సాహెబ్, ప్రేమ్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

### 123 ఏళ్ల చరిత్ర కలిగిన దేవస్థానంలో

# భక్తి పారవశ్యంతో జరిగిన బ్రహ్మోత్సవాల రెండో రోజు వేడుకలు

- మునీంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య మహోత్సవం



**విజయవాడ, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ రూరల్ మండలం నున్నలో వెలసిన 123 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి భరితంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల రెండో రోజైన సోమవారం రాత్రి, నిండు పున్నమి వెన్నెలలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, సిద్ధి--బుద్ధి వినాయక స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, శివకామేశ్వర సమేత నటరాజ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవం అత్యంత శోభాయమానంగా నిర్వహించారు.శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి పీఠాధిపతి మునీంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో, శివాచార్య గూడూరు గోపీకృష్ణ నేతృత్వంలోని ఋత్వికుల బృందం వేద మంత్రోచ్చారణల మధ్య ఈ మహోత్సవాన్ని నిర్వహించింది. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోగా, శివనామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ దివ్య కళ్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ భీమవరపు శంకర్ రెడ్డి దంపతులు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్. హేమలతా దేవి దంపతులు కల్యాణ మహోత్సవంలో కూర్చొని సేవలు సమర్పించారు. అనేక భక్త దంపతులు కూడా పాల్గొని స్వామివారి కృపను కోరుకున్నారు.అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, నున్న చెరువు సెంటర్‌లోని పేరంటాలమ్మ ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా కళ్యాణ రాయభారం కార్యక్రమం నిర్వహించారు. వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు తల్లిబోయిన దుర్గారావమ్మ, దర్శి సుజాత లక్ష్మీ, వడ్లమూడి పుణ్యవతి, యనగంటి సాంబశివరావు, అంగజాల శివయ్య, డాక్టర్ నల్లూరి ప్రసాదరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

భక్తుల కోలాహలం, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నాదం మధ్య జరిగిన ఈ దివ్య కళ్యాణోత్సవం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.

అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏర్పాట్ల మధ్య భక్తులకు మహాప్రసాదంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. స్వచ్ఛంగా, శ్రద్ధతో వడ్డించిన ప్రసాదాన్ని అందరూ ఆధ్యాత్మిక ఆనందంతో స్వీకరించి నిర్వాహకులను అభినందించారు.

# బోరంచ శ్రీ నల్ల పోచమ్మ ఆలయం మూసివేత

## చంద్రగ్రహణం సందర్భంగా తాత్కాలికంగా మూసివేత

### ఆలయ నిర్వాహక అధికారి శివరుద్రప్ప



నారాయణఖేడ్ మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : ఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం పరిధిలో బోరంచ గ్రామ శివారులో మంజీర నది ఒడ్డున వెలసిన శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహక అధికారి శివరుద్రప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంగళవారం ఏర్పడనున్న చంద్రగ్రహణాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 5:00 గంటలకు అమ్మవారికి అభిషేకం మరియు అలంకరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 6:00 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేస్తారు.ఆ సమయం నుంచి గ్రహణం ముగిసే వరకు అమ్మవారికి సంబంధించిన అన్ని పూజా, సేవా కార్యక్రమాలను నిలిపివేస్తామని తెలిపారు.గ్రహణం ముగిసిన తరువాత మరుసటి రోజు బుధవారం ఉదయం ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ఉదయం 8:00 గంటలకు భక్తులకు పునర్దర్శనం కల్పిస్తారు. ఆ తరువాత సాధారణంగా జరిగే పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.ఈ మార్పులను భక్తులు గమనించి ఆలయ అధికారులకు సహకరించాలని శివరుద్రప్ప తెలియజేశారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన

## - ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డి

### అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



నారాయణఖేడ్ మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : నారాయణఖేడ్ మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో సోమవారం అనంతసాగర్ గ్రామానికి చెందిన లక్ష్మీ బాయి భార్య దొండి రావు కుమార్తె వివాహం కోసం మంజూరైన కళ్యాణ లక్ష్మి పథకం చెక్కును అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన అరె మారుతి రావుకు వైద్య చికిత్స కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 60 వేల రూపాయల చెక్కును అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తుందన్నారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో తోడ్పాటు అందిస్తాయని ఉన్నారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలుసుకొని అవసరమైనప్పుడు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, మనోహర్ పాటిల్, నాగి రెడ్డి, శివ రెడ్డి, లోకేష్ రెడ్డి, మస్తాన్ సబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ నిధుల నుండి బోర్ మంజూరు

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్న ఎంపీ

### గ్రామాల అభివృద్ధికి ప్రజల సంక్షేమం దిశగా నిరంతరం కృషి





నారాయణఖేడ్ మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : నారాయణ ఖేడ్ నియోజిక వర్గం పరిధిలోని నాగల్ గిద్ద మండలం శేరి దామర్ గిద్ద గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జహీరాబాద్ పార్లమెంటు సభ్యుడు సురేష్ కుమార్ షేట్కార్ గారి సొంత నిధుల నుండి బోర్ మంజూరు చేయబడింది. సోమవారం బోర్ పనులకు శ్రీకారం చుట్టారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు , ఉపసర్పంచ్ శేరికర్ పండరినాథ్, వార్డ్ మెంబర్లు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు ఎండాకాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్య తీసుకున్నందుకు ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ గారికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ గారి సేవలు ప్రశంసనీయం అని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఎస్వీయం లో ఘనంగా 'పర్యావరణ హిత' హోలీ వేడుకలు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక శ్రీనివాస నగర్ లోని ఎస్ వి యం సెంట్రల్ పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో హోలీ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరితమైన వాతావరణంలో జరుపుకున్నారు . రంగుల పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రంగుల కేళిలో మునిగిపోయారు. ఈ ఏడాది పాఠశాల యాజమాన్యం పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని 'పర్యావరణ హిత హోలీ' పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఓంశ్రీ మాట్లాడుతూ "హోలీ అంటే కేవలం రంగులు చల్లుకోవడం మాత్రమే కాదనీ,మనసులోని ద్వేషాన్ని వీడి స్నేహభావాన్ని పెంచుకోవాలని, అన్నారు.విద్యార్థులు పర్యావరణానికి హాని కలిగించని రీతిలో పండుగలను జరుపుకోవడం అభినందనీయం," అని పేర్కొన్నారు. సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పసుపు, బీట్రూట్, హెన్నా వంటి సహజ పదార్థాలతో రంగులను ఎలా తయారు చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ "హోలీ అంటే ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకఅనీ, భక్త ప్రహ్లాదుని నమ్మకం



ముందు హిరణ్యకశిపుని గర్వం, హోలిక కుతంత్రం ఓడిపోయిన రోజనీ,ఈ కథ మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పు తుందనీ,ఎన్ని ఆటంకాలు ఎదురైనా, సత్యం మరియు ధర్మం వైపు నిలబడే వారికే చివరికి విజయం లభిస్తుందని అన్నారు. మరో డైరెక్టర్ కొండ శ్రీధర్ రావు మాట్లాడుతూ హోలీ పండుగ కేవలం రంగుల కేళి మాత్రమే కాదని, అది సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను



పెంపొందించే గొప్ప సందర్భమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. నీటి వృధాను అరికట్టడంలో భాగంగా, రసాయన రంగులకు బదులుగా గులాబీ, బంతి వంటి రంగురంగుల పూల రేకులతో విద్యార్థులు హోలీ ఆడుకున్నారు. హోలీ విశిష్టతను చాటిచెప్పేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, నాటకాలు అందరినీ ఆకట్టు కున్నాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటామని విద్యార్థులు చాటిచెప్పారు. వేడుకల అనంతరం విద్యార్థులందరికీ సంప్రదాయ మిఠాయిలను పంపిణీ చేశారు.

# కాంగ్రెస్ పాలనపై మండిపడిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెల కొన్నాయని, పేదల ఇండ్లను కూల్చడమే పాలకులు ఒక పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటూ పాలకులు ఊదరగొడు తున్నారని, వాస్తవానికిప్పుడు కొనసాగుతున్నది "బుల్డోజర్ల రాజ్యం"అని ఆయన దుయ్య బట్టారు. రామగుండంలో పేదల ఇండ్లను, మహబూబ్ నగర్ లో దివ్యాంగుల గూళ్లను,వెలుగుమట్లలో నిరుపేదల గుడిసెలను కూల్చారని,హైడ్రా పేరుతో పాలకులు విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. ఎంపీ రవిచంద్ర హైదారాబాద్ తెలంగాణ భవన్ లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు జాడే కనిపించట్లేది ఆవేదన చెందారు.కాంగ్రెస్ నాయకులకు పాలించడం రాక"డైవర్షన్ పాలిటిక్స్" చేస్తున్నారని, మూసీ సుందరీకరణ,గాంధీ సరోవర్ పేరుతో అపార్టుమెంట్లు,పక్కా ఇండ్లను నేలమట్టం చేసే ప్రయత్నాలు జరుగుతుండడం శోచనీయమన్నారు.రాష్ట్రానికి వచ్చిన కాంగ్రెస్ అధినేత రాహూల్ గాంధీ ఇక్కడ నెలకొన్న గందరగోళ పరిస్థితులపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఎంపీ రవిచంద్ర హితవు పలికారు.ఎన్నికలకు ముందు రాహూల్, ప్రియాంకా గాంధీలు వరంగల్, కామారెడ్డి తదితర డిక్లరేషన్లను ఆర్భాటంగా ప్రకటించి,432కుపైగా హామీలిచ్చారన్నారు. ఈ హామీల అమలు ఎంతవరకు వచ్చిందో, ఇస్తామన్న 2లక్షల ఉద్యోగాలలో ఇప్పటి వరకు భర్తీ జరిగిందెన్నో సమీక్షించాల్సిన బాధ్యత రాహూల్ గాంధీపై ఉందని ఎంపీ రవిచంద్ర





పేర్కొన్నారు.బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు "బుల్డోజర్ రాజ్యం"అంటూ విమర్శించే రాహూల్ తాము పాలిస్తున్న తెలంగాణలో ప్రతినిత్యం బుల్డోజర్ల కింద పేదల బతుకులు చితికిపోవడం గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా జీవనం గడుపుతున్న పేదలపై పోలీస్ బలగాలతో విరుచుకుపడి గుడిసెలను నేలమట్టం చేయడంతో "ఇరాన్,గాజా"ల మాదిరి పరిస్థితి నెలకొన్నదని ఎంపీ వద్దిరాజు ఆందోళన వ్యక్తం చేశారు.నిల్వ నీడలేక,ఆకలితో అలమటిస్తున్న బాధితులను బీఆర్ఎస్ తరపున ఆదుకుంటుంటే ఓర్వలేని పాలకులు పోలీసులతో కొట్టిస్తున్నారని, అంబేద్కర్ భవనం నుంచి తరిమికొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.వెలుగుమట్లలో నెలకొన్న పరిస్థితులు, బాధితుల హృదయవిదారక బతుకులను కళ్లారా చూసేందుకు ఖమ్మంలో పర్యటించాల్సిందిగా మీడియా ద్వారా రాహుల్ గాంధీని ఆయన కోరారు.బాధితులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీనిచ్చినట్లు తాము అధికారంలోకి వచ్చాక కట్టించి న్యాయం చేస్తామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,గాంధీ నాయక్,బొమ్మెర రాంమూర్తి, డాక్టర్ కురవ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 34 ఏళ్ల తర్వాత గురుశిష్యుల మధుర మిలనం....

## ఘనంగా భువనగిరిలో చందుపట్ల జెడ్పీహెచ్ఎస్ 1991-92 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం.....



భువనగిరి, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : కాలం ఎంత దూరం తీసుకెళ్లినా, గురువుల బోధనలు -- బాల్య స్నేహాల బంధాలు మాత్రం ఎప్పటికీ మసకబారవని చాటిచెప్పుతూ చందుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991--92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్నారు. భువనగిరిలోని ఎస్.ఆర్. (శ్రుతిరెడ్డి) మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనం హృద్య వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి అప్పటి ప్రధానోపాధ్యాయులు యాదిరెడ్డి సర్, అప్పటి తరగతిఉపాధ్యాయుడు ప్రస్తుతం సారాజిపేట్ ప్రధానోపాధ్యాయులుగా ఉన్న జ్యోతి రాజు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వర్గస్తులైన గురువులు మరియు సహ విద్యార్థులకు నివాళులర్పించారు. అనంతరం గురువులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించడం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణం, కుటుంబ స్థితిగతులు, వృత్తి రంగంలో సాధించిన విజయాలను పరస్పరం పంచుకున్నారు. బాల్య స్నేహాల్ని తలచుకుంటూ పాఠశాల రోజుల జ్ఞాపకాలను మళ్లీ జీవ్వమనిపించారు. కొందరు గురువులు విద్యార్థుల పట్ల తమ ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తూ "విద్యార్థుల విజయమే గురువుల నిజమైన గౌరవం" అని పేర్కొన్నారు. గురుశిష్యుల మధ్య ఉన్న ఆత్మీయ బంధం సభంతా ప్రతిధ్వనించింది. భోజన విరామం అనంతరం పాటలు, నృత్యాలు, సరదా సంభాషణలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. పాత మిత్రులు ఒకరికొకరు జ్ఞాపికలు అందించుకోవడం భావోద్వేగ క్షణాలను సృష్టించింది. ఈ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించిన తంగళ్లపల్లి కృష్ణమాచారికి పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులుగా సీహెచ్ జోస్సాఫ్, బీ కరుణాకర్, బి.శ్రీలత, రాజేశ్వరి, ఎస్ శ్రీశైలం, సత్తిబాబు, ఆర్ ఇస్తారి, ఆర్ యాదగిరి, కె మహేందర్ తదితరులు వ్యవహరించారు. ఇలాంటి సమ్మేళనాలు గురుశిష్యుల బంధాన్ని మరింత బలపరుస్తాయని, ప్రతి ఏడాది ఒకసారి నిర్వహించాలనే సంకల్పాన్ని విద్యార్థులు వ్యక్తం చేశారు. 34 ఏళ్ల అనంతరం కలుసుకున్న ఈ మధుర మిలనం అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

# చత్తీస్గడ్ రాష్ట్రంలో 15 మంది మావోయిస్టుల లొంగుబాటు



ఖమ్మం,చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) : చత్తీస్గడ్ రాష్ట్రంలోని మహా సముంద్ జిల్లా కేంద్రంలో ఒడిస్సా రాష్ట్ర మావోయిస్టు పార్టీ కమిటీకి చెందిన పశ్చిమ సబ్ జోన్ పరిధిలోని బర్గడ్ - బలంగిర్ - మహాసాముంద్ ( బి బి ఎం ) డివిజనకు చెందిన మొత్తం 15 మంది సాయుధ మావోయిస్టులు ఆయుధాలు తో సహా జిల్లా ఎస్పీ అశుతోష్ సింగ్, ఇతర పోలీసు అధికారుల ఎదుట లొంగి పోయారు. లొంగిపోయిన వారిలో 9 మంది మహిళలు, ఆరుగురు పురుషులు



ఉన్నారు. లొంగిపోయిన వారందరు భద్రత, అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై 73 లక్షల రివార్డు కలదని అధికారులు తెలిపారు. స్టేట్ కమిటీ మెంబర్ (యస్ సి యం ) -- రూ. 25 లక్షలు డివిజనల్ కమిటీ మెంబర్లు (డీసీఎం ) -- రూ. 8 లక్షలు చొప్పున ఏరియా కమిటీ మెంబర్లు (ఏసీమ్ ) -- రూ. 5 లక్షలు చొప్పున,పార్టీ మెంబర్లు (పీఎం ) -- రూ. 1 లక్ష చొప్పున మొత్తం 14 అత్యాధునిక ఆయుధాలు సమర్పించారు. ఎ కె -47 రైఫిల్ -- 03 యస్ యల్ ఆర్ రైఫిల్ -- 02, ఇన్సాస్ రైఫిల్ -- 02,303 రైఫిల్ -- 04,12 బోర్ తుపాకులు -- 03, అప్పగించారు. లొంగి పోయిన . వారిలో అత్యంత సీనియర్ అయిన వికాస్ అలియాస్ సుదర్శన్ / జంగూ / బాబన్న / రాజన్న / ముప్పిడి సామ్బయ్య (వయస్సు 57 సంవత్సరాలు) స్టేట్ కమిటీ మెంబర్ (యస్ సి యం )గా, బీబీమ్ డివిజన్ ఇన్‌చార్జ్‌గా పనిచేశాడు. 1985 నుంచి మావోయిస్టు సంస్థలో క్రియాశీలకంగా ఉండి, పలు రాష్ట్రాల్లో కీలక బాధ్యతలు నిర్వహించాడు. అతను ఎ కే -47 ఆయుధంతో ఆత్మసమర్పణ చేశాడు. సంస్థాగత ప్రభావం లొంగు బాటు కార్యక్రమం అనంతరం ఒడిశా రాష్ట్ర కమిటీకి చెందిన పశ్చిమ సబ్‌జోన్ పూర్తిగా నిర్మూలించబడింది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ పోలీస్ రేంజ్, ఒడిశా రాష్ట్రంలోని సంబల్పూర్ రేంజ్ పూర్తిగా మావోయిస్టు రహితంగా మారాయి. ఇది మార్చి 2026 నాటికి నక్సలిజం సంపూర్ణ నిర్మూలన లక్ష్యం వైపు ఒక నిర్ణయాత్మక అడుగు ఆత్మసమర్పణకు నేపథ్యం

### మహాసముంద్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న మావోయిస్టులతో సంబంధాలు ఏర్పరచేందుకు:

ఆకాశవాణి,బ్యానర్లు,పోస్టర్లు,పాంప్లెట్లు,ఇతర సమాచార మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానంపై నిరంతరం అవగాహన కల్పించబడింది.

### ఈ విధానంలో భాగంగా:

హోదా ప్రకారం బహుమతి మొత్తం,ఆయుధాలతో ఆత్మసమర్పణకు ప్రత్యేక ప్రోత్సాహకాలు వైద్య సౌకర్యాలు నివాసం,



ఉపాధి అవకాశాలు విస్తృతంగా ప్రచారం చేయబడింది. ముందుగా ఆత్మసమర్పణ చేసిన మావోయిస్టులు కుటుంబాలతో కలిసి శాంతియుతంగా, గౌరవప్రదంగా జీవిస్తున్న దృశ్యాలు చూసి ప్రేరణ పొందిన ఈ 15 మంది, హింస మార్గాన్ని విడిచిపెట్టి సమాజ ప్రధాన జనజీవన ప్రవంతిలోకి చేరాలని నిర్ణయించారు. సన్మాన కార్యక్రమం ఆత్మసమర్పణ అనంతరం, పరసదా రక్షిత కేంద్ర ప్రాంగణంలో, పోలీసు అధికారులు

### ఆత్మసమర్పణ చేసిన వారికి:

త్రివర్ణ పతాకం భారత రాజ్యాంగ ప్రతిని శాంతి, ప్రేమ, నూతన జీవితానికి ప్రతీకగా ఎర్ర గులాబీ పువ్వులు అందజేసి గౌరవించారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం - జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామాల సర్వతో ముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగాఎన్నికైన సర్పంచులు బాధ్యతా యుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు (నాలుగు మండలాలకు చెందిన 4వ బ్యాచ్) నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ,శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న, గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా పరిష్కరించాలి,





అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలి వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యతని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించి, ప్రాధాన్యత ఆధారంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీటి సరఫరా సవ్యంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్‌తో కూడిన బ్యాగులను జిల్లా కలెక్టర్ సర్పంచులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## నారాయణఖేడ్ లో మురికి కాలువ శుభ్రం, ప్రజారోగ్యానికి చర్యలు



నారాయణఖేడ్ మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : నారాయణఖేడ్ పట్టణంలోని 2, 3, 8 వార్డులలో సోమవారం మురికి కాలువల నుండి తీసిన చెత్తను మున్సిపాలిటీ వాహనాల ద్వారా డంపింగ్ యార్డ్ లో వేస్తున్నట్లు శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షేట్కార్, కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లి దుర్వాసన రాకుండా, ప్రజల ఆరోగ్యానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా అన్ని వార్డులలోనూ కాలువలను పరిశుభ్రం చేస్తామని, ప్రజలు చెత్తను చెత్తబుట్టలో వేసి అధికారులకు సహకరించాలని అన్నారు.

## పీఎం రాహత్ స్కీం పై వర్క్ షాప్ నిర్వహణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మొదలవుతున్న పీఎం రాహత్ స్కీం మీద సోమవారం నిజామాబాద్ లో గల ఐడిఓసి ఎన్ఐసి కాన్ఫరెన్స్ హాలులో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గల ఆరోగ్యశ్రీ మిత్రలకు,ఆపరేటర్లకు వర్క్ షాప్ నిర్వహించడం జరిగినది.ఇట్టి సమావేశంలో డిసిపి బసవ రెడ్డి మాట్లాడుతూ..ఇట్టి స్కీములో ప్రతి ఆక్సిడెంట్ బాధితులకు కేంద్ర ప్రభుత్వం నుండి 1,50,000 వరకు లేదా ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స ఉంటుందని ఆరోగ్య మిత్రల సహకారం ఉండాలని వారు ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఉండాలని బాధితులకు సహాయ సహకారాలు అందించాలని తెలిపినారు.ఈ వర్క్ షాప్ లో ట్రైనింగ్ ఇచ్చిన ఈడార్ మేనేజర్ వర్షాన్నిహందు మాట్లాడుతూ.. తొందరగానే మన జిల్లాలో ఈ స్కీం మొదలవుతుందని ఇట్టి స్కీములో పోలీసు,హెల్త్ డిపార్ట్మెంట్ సమన్వయంతో పని చేయవలసి ఉంటుందని తెలిపినారు.అదేవిధంగా స్కీము కూడా పోలీసు,ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్,హెల్త్ డిపార్ట్మెంట్ ల సహకారంతోనే ముందుకు వెళుతుందని తెలిపినారు.ఇట్టి వర్క్ షాప్ లో జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధు,డీఎంహెచ్వో రాజశ్రీ,జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ శశాంక్ రెడ్డి,సుపరిండెంట్ భాస్కర్ ఆరోగ్యశ్రీ మిత్రలు,ఆపరేటర్లు పాల్గొన్నారు.



## ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు.సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,ఇంచార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు.83 వినతులు అందగా,వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు.అయితే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజర్ అయ్యారు.దీనిని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి,ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.గైర్హాజర్ అయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు.అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,బోధన్ ఏసీపీ శ్రీనివాస్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇంచార్జి అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ గా(స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఐ.ఏ.ఎస్ అధికారి అంకిత్ కు పదోన్నతి కల్పిస్తూ ఇటీవలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేసిన విషయం విదితమే.ఆయన స్థానంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ గా నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను నియమించారు.ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించిన మీదట,మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఇంచార్జి అదనపు కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్ ను పలువురు జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మానవ సమాజ నిర్మాణంలో సైన్స్ పాత్ర ముఖ్యం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### కుంటబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 03 (జర్నలిస్ట్ ఫైల్) : మానవ సమాజ నిర్మాణంలో జన్యుశాస్త్రం పాత్ర ప్రత్యేకమైనదని, ఈ విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పద్మావతి కాలనీ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోసం నూతనంగా ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్ ను షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ స్థానిక కౌన్సిలర్ పెంటయ్య, ఎంఈఓ మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యమ్మలతో కలసి ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. అనంతరం విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాష్ రూం లను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో పాఠశాల విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలు ఎంతో మెరుగ్గా ఉన్నాయని ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కౌన్సిలరు దిలీప్, మురళీ మోహన్ (అప్పి)సాధిక్, ముబారక్ అలీ ఖాన్, అనిల్,చందు,ఖదీర్ ప్రదీప్ ముదిరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరగని సేవల స్ఫూర్తి ప్రధాత డి ఎస్ ఆర్ కె ప్రసాద్..

మియాపూర్ (జర్నలిస్ట్ ఫైల్) : గత 20 సంవత్సరాలుగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలో ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తూ, రాజకీయ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అనేక సేవాకార్యక్రమాలు చేపట్టి, ప్రజలతో ప్రతి రోజు మమేకమై ప్రజల అవసరాలు తీర్చడం ఆయనకు అలవాటుగా మార్చుకున్న వ్యక్తి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ప్రసాద్స్ ఫౌండేషన్ స్థాపించి, స్వైన్ ఫ్లూ మందులు దగ్గరనుంచి, కరోనా వాక్సినేషన్స్ వరకు, అర్హులయిన వారికి రేషన్ కార్డ్స్, పెన్షన్స్ ఇప్పించడం కరోనా సమయం లో ఉచిత మందుల పంపిణీ, నిత్యావసరాల



పంపిణీ, పేద ప్రజలకు తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, వెట్ గ్రైండర్స్, దుప్పట్లు, వికలాంగులకు చేయూత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో, కర్నూలు, విశాఖపట్నం వరద బాధితులకు నిత్యావసరాలు, విరాళాలు, దుప్పట్లు, పంపిణి వంటి ఎన్నో సేవలు అందించడం జరిగింది, యువ ఇంజనీర్ కి యాక్సిడెంట్ జరిగితే నిమ్స్ హాస్పిటల్ లో వారికి చికిత్స కోసం ధన సహాయం చేయడం జరిగింది.



గవర్నమెంట్ స్కూల్స్ లో పుస్తకాలు, ఎక్సమినేషన్ కిట్స్, ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది, ముఖ్యంగా పలు కాలనీలలో కార్పొరేట్ హాస్పిటల్స్ వారిని తీసుకొచ్చి ఇప్పటికి 15 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పేద వారికి అండగా ఉంటూ, సమాజ సేవ చేస్తున్నారు, ప్రసాద్స్ ఫౌండేషన్ లో డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తో పాటు లీలా ప్రసాద్ ఫౌండేషన్ డైరెక్టర్ గా, ప్రోగ్రాం చీఫ్ కో ఆర్డినేటర్ గా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. యువతకు క్రికెట్, షటిల్ బ్యాట్మింటన్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం జరిగింది, ముఖ్యం గా చేతన ఫౌండేషన్ వెనిగళ్ళ రవి కుమార్ సహకారంతో, వారి స్ఫూర్తి తో ప్రసాద్స్ ఫౌండేషన్ స్థాపించడం, పేదల పాలిట ఒక వరం గా భావిస్తున్నట్లు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తెలిపారు, అనాథ పిల్లలకు ఫ్రూట్స్, బ్రెడ్స్, నిత్యావసరాలు, గత 20 సంవత్సరాలలో అనేక సార్లు సహాయం చేయడం జరిగింది. అనాథలు ఫుట్ పాత్ మీద పడుకునే వారిని గుర్తించి వారికి ఆహారం అందించడం, వారికి దుప్పట్లు అందించడం జరిగింది. అలాగే సేవే లక్ష్యం సేవే ముఖ్యం అనే నినాదం తో ఎన్నో కార్యక్రమాలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వేల సంఖ్యలో మొక్కలు నాటారు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, జోన్ చైర్మన్ గా, అనేక బ్లడ్ డొనేషన్ క్యాంపులు, హెల్త్ క్యాంపులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, కళ్ల అద్దాల పంపిణీ, కంటి రెటీనాలు కలెక్ట్ చేయడం జరిగింది, ముఖ్యం గా ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఏ కార్యక్రమం తలపెట్టినా అందుబాటులో ఉండడం, తలపెట్టిన కార్యక్రమం కోసం అహర్నిశలు కృషి చేయడం చాలా సంతోషంగా ఉంది అని ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్ తెలిపారు. అలాగే మా ప్రసాద్స్ ఫౌండేషన్ రీల్స్ కాదు రియల్ గా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి వారికి అండగా వుండే ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కి, మా సభ్యులు భాషా , రవి, వినోద్ చౌదరి,



సురేందర్, రాంబాబు, మూర్తి , శేఖర్ నాయుడు, వెంకట్రావ్, ఎం ఆర్ కె చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి , నరేశ్ నాని, అభిజిత్, రాము, యశ్వంత్, వరుణ్, మహేశ్ బాబు లకు ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని లీలా ప్రసాద్ తెలిపారు.

## వైద్యశాఖ సిబ్బంది పనితీరు మెరుగుపడాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు

ఖమ్మం, మార్చి 03(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ప్రతి నెల నిర్వహించే మీటింగ్ లో భాగంగా పని తీరు లో మార్పు ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రేరణ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ హాస్పటల్స్ వాళ్లు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విధంగా ప్రభుత్వ పి.హెచ్.సి.లను, హాస్పటల్స్ ను కూడా తప్పక రిజిస్ట్రేషన్




చేయించాలని, జిల్లాలో ప్రభుత్వ హాస్పటల్లలో ' సి ' సెక్షన్ ( సిజేరియన్ ) లు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి, ఎందుకోసం 'సి ' సెక్షన్ (సిజేరియన్ ) ఆపరేషన్లు జరుగుతున్నాయో ప్రతి కేసును క్షుణ్ణంగా ఆడిట్ చేయాలనీ, నార్మల్ డెలివరీస్ ను ప్రోత్సహించాలని, ఈ నెల 4వ తేది నుండి మన జిల్లాలో హెచ్.పి.వి. ( హ్యూమన్




పాపిలోమా వైరస్ )వ్యాక్సిన్ ( 14 సంవత్సరాల వయసు కలిగిన బాలికలలో సర్వైకల్ క్యాన్సర్ నివారణ కొరకు ) ను ప్రారంభం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇందుకుగాను ప్రభుత్వం , వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని, జిల్లాలో విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు కాబట్టి, విద్యార్థులు పరీక్షలకు భయపడ్డా, ఒత్తిడికి లోనైనా, నిద్రలేమి, నిరాశ, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తలితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రభుత్వం, కమీషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ' టెలీ మానస్ 14416' టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి డాక్టర్లు, నిపుణులచే పరిష్కారం ' పొందగలరని, జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ టార్గెట్ లక్ష్యాలను చేరుకోలేకపోతే, మన జిల్లా వల్ల రాష్ట్ర లక్ష్యాల శాతం కూడా తగ్గే అవకాశం వుంది కాబట్టి ప్రతి పి.హెచ్.సి.కి కేటాయించిన లక్ష్యాలను తప్పక పూర్తిచేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. చివరగా హెల్త్ సూపర్వైజర్ లంక కొండయ్య ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని, చేతి సంచులను వాడాలనే ఉద్దేశ్యంతో తాను తీసుకు వచ్చిన ' చేతి సంచులను ' జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఏ.ఎన్.సి. ( గర్భిణీ స్త్రీల నమోదు వెంటనే చేయాలనీ, ఇమ్యూనైజేషన్ డ్యూ లేకుండా చూడాలని, ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సాహించాలని, ఎన్.సి.డి. మందులు ప్రతి నెల లబ్దిదారులకు సరైన సమయంలో అందజేయాలనీ, సమయపాలన పాటించాలని, ఎండాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలనీ జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. చందు నాయక్ తెలిపారు. సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణా దేవి, డెమో వి. సుబ్రహ్మణ్యం, ఎస్.ఓ. నవీన్ కుమార్, హెల్త్ ఎడుకేటర్ అన్వర్, ప్రగతి, పి.హెచ్.సి.ల నుండి విచ్చేసిన సి.హెచ్.ఓ.లు, హెచ్.ఈ.ఓ.లు,పి.హెచ్.ఎన్.లు, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పేద ప్రజల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం..

### బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు..

శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం రోజున బి ఆర్ ఎస్ పార్టీ శేర్లింగంపల్లి ఇంచార్జ్ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచన మేరకు ఉమ్మడి మియాపూర్ డివిజన్ లో ప్రజా సమస్యల పై పరిష్కారం కోసం బి ఆర్ ఎస్ పార్టీ సుభాష్ చంద్రబోస్ నగర్ రోడ్ నెంబర్ వన్ దగ్గర నుండి బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు కలిసి ప్రజాసమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. రెండవ రోజు పాదయాత్రలో భాగంగా సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఉన్న అనేక సమస్యలపై అక్కడ కాలనీవాసులను అడిగి తెలుసుకుని వారి సమస్యలపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇస్తూ బీ ఆర్ ఎస్ పార్టీ నుంచి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని సుభాష్ చంద్రబోస్ నగర్ ప్రజలు ఓట్లేసి గెలిపించుకున్న ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ ప్రజా సమస్యలు గాలికి వదిలేసి స్వలాభం కోసం కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయి భూ కబ్జాదారుల కొమ్ము కాస్తూ నిలబెట్టే పార్టీని వదిలేసి కూలగొట్టే పార్టీలో చేరి కాలనీలా సమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే బినామీలకు అండగా ఉంటూ ప్రశ్నించిన



వారిపై అక్రమ కేసులు పెట్టిస్తూ కబ్జా చేసిన భూములను మరియు బినామీలను కాపాడుకోవడం కోసం గాంధీ ని శేరిలింగంపల్లి ప్రజలు గెలిపించలేదని ప్రజా సమస్యలు తీరుస్తాడని గెలిపించుకుంటే కాలనీవాసుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని పైగా సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో కనీసం బాత్రూం తలుపులు కూడా పెట్టుకొనీ యకుండా మిల్ట్రీ వాళ్ళు అరాచకాలు చేస్తుంటే మిల్ట్రీ వాళ్ళతో ఏ ప్రాబ్లం రాకుండా చూసుకోవలసిన ఎమ్మెల్యే వారితోనే కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికీ ఇండ్లు ఇస్తామని జాగా ఉంటే కట్టుకోవడానికి డబ్బులు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 500 పైగా రేకుల ఇండ్లున్న గుడిసెలు మీకు కనబడడం లేదా పైగా వారికి డ్రైనేజీ వాటర్ రాకుండా చేసి చిత్రహింసలు గురిచేస్తున్న ఎమ్మెల్యే కి తగిన గుణపాఠం చెప్పాలని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీవాసులకు బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం ఈకార్యక్రమంలో తాట్ రెడ్డి సంతోష్ రెడ్డి, బి ఎస్ ఎన్ కిరణ్ యాదవ్, కలిదిండి రోజా, గోపరాజు శ్రీనివాసరావు, శివరాజ్ ముదిరాజ్, కాసాని శ్రీధర్, శ్రీనన్న, జహంగీర్, రవి, కృష్ణా నాయక్, తిరుపతి నాయక్, గోపాల్ నాయక్, నర్సింగ్, వంశీ, సుధాకర్, రాజు వడ్డేరాజ్ చిన్న, శ్రీశైలం, వరలక్ష్మి, రమేష్, హనుమంత్, శ్రీను, చందు వర్మ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రజాస్వామ్య బలోపేతంలో యువతే కీలకం

### ఘనంగా ఖమ్మం జిల్లా స్థాయి 'యువ మాక్ పార్లమెంట్' ఉత్సాహం

### మహిళలు అన్నిరంగంలో రాణించాలి జిల్లా మహిళా ప్రాంగణ సంక్షేమ అధికారి వేల్పుల విజేత పిలుపు




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అపారమైన మేధోసంపత్తి కలిగిన యువత చదువు, ఉద్యోగాల తో పాటు రాజకీయాల వైపు, నాయకత్వం వైపు అడుగులు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వేదికగా జరిగిన జిల్లా స్థాయి యువ పార్లమెంట్ పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి.

### పార్లమెంటరీ విధానాలపై అవగాహన




ఈ కార్యక్రమంలో విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా మారి, సభా మర్యాదలను పాటిస్తూ దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలపై చర్చించారు. ప్రశ్నలు అడగడం, సమాధానాలు చెప్పడం, బిల్లులపై చర్చ వంటి అంశాల్లో తమ ప్రతిభను చాటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ పనితీరు, చట్టాల తయారీ ప్రక్రియపై యువతకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమైనదాని కార్యక్రమ ముఖ్య అతిథి పాల్గొన్న జిల్లా మహిళా ప్రాంగణ సంక్షేమ అధికారినీ వేల్పుల విజేత అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం ఓటు వారు వేయడమే కాకుండా, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమస్యలను ప్రశ్నించే తత్వం, విశ్లేషణాత్మక ఆలోచనలు యువతను ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దుతాయనీ కొనియాడారు ప్రజాస్వామ్య రక్షణ కోసం రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే పటిష్టమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించగలం.






### రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక

ఈ జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 గురినీ ప్రథమ స్థానం ఎం అఖిల, ద్వితీయ స్థానం లావణ్య, తృతీయ స్థానం ఎం డి నదియా హసీన్, 4వ స్థానం పి హనుమంత్, 5వ స్థానం ఎస్ కె హుస్సేన్ బీ విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మరో 5 గురు ప్రతిభ సర్టిఫికేట్ అందజేశారు. మరో ముఖ్యఅతిథి 36 వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావడం ద్వారానే నిజాయితీ గల నాయకుడు తయారు అవుతారని అన్నారు. ఖమ్మం రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి యువ మాక్ పార్లమెంట్ కు ఎంపిక చేస్తారనీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి తెలిపారు.ప్రతినిధులు దేశ రాజధాని ఢిల్లీలో తమ గళాన్ని వినిపించే అవకాశం లభిస్తుంది. వికాసిత్ భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భాను చందర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఏ జె రామారావు, ఐ క్యూ ఎ సి కో ఆర్డినేటర్ అసోసియట్ ప్రొఫెసర్ ప్రవీణ్, జ్యూరీ సభ్యులు రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బి వెంకటేశ్వర రెడ్డి, ఎస్ ఆర్ అండ్ బిజీ ఎన్ ఆర్ అధ్యాపకులు డాక్టర్ డి ధనమూర్తి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రవి వర్ధన్, జ్యూరీ సభ్యులు తెలుగు అధ్యాపకులు వెంకటరమణ, మోటివేషనల్ స్పీకర్ తాటిపల్లి సుధీర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్యామల దేవి, రాంకుమార స్వామి, కళాశాల అధ్యాపకులు చేకూరి రమేష్ అసోసియేట్ ప్రొఫెసర్ బొంద్యాల నాయక్ రాజనీతి శాస్త్ర అధ్యాపకులురాలు డాక్టర్ ఎ చరిత్ర అద్దేపల్లి, అధ్యాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, రవిశంకర్ , విద్యార్థినులు, జిల్లా యువజన అధికారులు పాల్గొన్నారు. విజేతలను అభినందిస్తూ, వారు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

# శ్రీటౌన్ పరిదిలోని పలు కూడళ్ళలో సిసి కెమేరాల నిఘా



○ డిఎస్పీ. బి. జనార్ధనరావు

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): పట్టణంలో నేరాల రేటునుతగ్గించే దిశగా సిసి కెమేరాల ఏర్పాటుకు తగు ప్రాధాన్యం కల్పించే విషయంలో ప్రజలు స్వచ్ఛంగా తోడ్పడాలని తెనాలి డిఎస్పి బి. జనార్ధనరావు పేర్కొన్నారు.
స్ధానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో సిసి కెమేరాల ఏర్పాటును మంగళవారం డిఎస్పీ బి. జనార్ధనరావు క్షేత్ర స్ధాయిలో పరిశీలించారు.
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో నేరాల రేటు తగ్గించే దిశగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిదిలో 200సిసి కెమేరాల ఏర్పాటు లక్ష్యంగా చేపడుతున్న కార్యాచరణలో ప్రజల స్వచ్ఛంగా, వారి నివాసాలలో, సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో, అనేక నేరాల్లో, దోషులను త్వరిత గతిన పట్టుకునేందుకు సిసి కెమేరాలు ఉపయోగ పడిన విధానాన్ని వివరించారు. త్రీ టౌన్ సి ఐ ఎస్. సాంబశివరావు మాట్లాడుతు త్రీ టౌన్ లిమిట్స్ లో, గుర్తించిన 12ప్రదేశాల్లో, 65 సిసి కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఏరియాల వివరాలు వెల్లడించారు. ఈకార్యక్రమంలో త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# మంత్రి లోకేష్ ఆదేశాలతో నీటి నాణ్యతపై దృష్టి




○ పంప్ హౌస్ లను పరిశీలించిన కమిషనర్
○ నాణ్యమైన తాగునీరు అందించేందుకు చర్యలు
○ వార్డులో క్లోరిన్ పరీక్షలు, లీకేజీలపై తక్షణ చర్యలు

మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్): నారా లోకేష్ ఆదేశాలలో భాగంగా మంచినీటి నాణ్యత పై మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన పంప్ హౌస్‌లను పరిశీలించారు. తాగునీటి ఉత్పత్తి, శుద్ధి , పంపిణీ , యంత్రాంగం పనితీరు, నిల్వ ట్యాంకులు, ఫిల్టర్లు, పంపుల పరిస్థితిని తెలుసుకున్నారు. నాణ్యమైన సురక్షిత తాగునీటిని అందజేయటమే ప్రధాన లక్ష్యమని కమిషనర్ అలీమ్ భాష అన్నారు.
వార్డ్ అమీనిటీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశమై నీటి నమూనాల సేకరణ, ప్రయోగశాల పరీక్షలు, నాణ్యత నియంత్రణ చర్యలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. డ్రైన్--క్రాసింగ్ పైపులైన్లను పూర్తిగా పరిశీలించి లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. హెడ్ వాటర్ వర్క్స్ ,పంపిణీ కేంద్రాల నుంచి నీటి నమూనాలను 48 గంటల్లోపు గుంటూరు రీజనల్ లాబరేటరీకు పంపించి నివేదికలను కార్యనిర్వాహక అధికారికి సమర్పించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఎక్కడైనా లీకేజీ లేదా కాలుష్య ప్రమాదం గుర్తించిన వెంటనే నీటి సరఫరా నిలిపివేసి అవసరమైతే పైపులైన్లను డ్రైన్ల నుంచి దూరంగా మార్చి మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటిలో రంగు మార్పు, వాసన, మురికి నీరు రావడం , లీకేజీలు గమనించిన వెంటనే నగర పాలక సంస్థ ప్రత్యేక కాల్ సెంటర్ నంబర్లు 7093912653, 08645-295193 కు సమాచారం అందచేయాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బ్రహ్మంగారిమఠంలో నేడు రేపు పలు వాటికి వేలం పాటలు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నేడు రేపు బహిరంగంగా వేలంపాటలు నిర్ణయించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలతో నూతన మఠాధిపతులు వీర ధర్మజ వెంకటాద్రి స్వామి అనుమతితో వేలం పాటలు నిర్వహిస్తామని ఆలయ మేనేజర్ ఈశ్వర చారి ఓ ప్రకటనలు తెలిపారు. ఈ ప్రొక్యూర్మెంట్ రూపంలో టెండర్లు ఆహ్వానించబడుచున్నవి మఠం ఆవరణలో 4.3.2026 మరియు 5.3.2026 వ తేదీల్లో బహిరంగ వేలం పాటలు జరుపబడును. వేలంపాటలకు సంబంధించిన డిపాజిట్ డిడి ల రూపంలో చెల్లించవలెను. మఠం ప్రాంగణం నందు కొబ్బరి చిప్పలు వసూలు చేసుకొను హక్కు పోలేరమ్మ వద్ద టెంకాయలు అమ్ముకొనే హక్కునకు పోలేరమ్మ వద్ద కొబ్బరి చిప్పలు వసూలు చేసుకుని హక్కునకు పార్కు వెలుపల ఉన్నటువంటి సులబ్ కాంప్లెక్స్ నిర్వహించుకొనుటకు డార్మెంటరీ హాల్ లాకర్ వసూలు చేసుకొను హక్కునకు డార్మెంటరీ వద్ద టాయిలెట్స్ పరిశుభ్రం చేసుకుని రుసుము వసూలు చేసుకుని హక్కునకు పాదరక్షలు భద్రపరచుట కొరకు రుసుం వసూలు చేసుకుని హక్కునకు మరియు ఐదో తారీకు భక్తులు సమర్పించుకొను తలవెంట్రుకలు వసూలు చేసుకొని హక్కునకు వేలంపాటలు నిర్వహించబడును. అని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):కాకుమాను లో అర్హులైన పలువురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలుగుదేశం పార్టీ కాకుమాను మండలం అధ్యక్షులు మామిళ్లపల్లి రామ్ గోపాల్ అదజేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పేద బడుగు మధ్య తరగతి వర్గాల కుటుంబాలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించడమే సీఎం రిలీఫ్ ఫండ్ ఉద్దేశం అన్నారు. ఏడుగురుకు రూ. 4.20లక్షల నగదు చెక్కులను మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో సంగం డైరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యా చౌదరి, కాకుమాను గ్రామ టీడీపీ అధ్యక్షులు నల్లమోతు పూర్ణ చంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అందరికీ ఆరోగ్యం

○ సీఎం సహాయ నిధి పేదలకు వరం
○ ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం
○ పేదల వద్దకే కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేస్తున్నాం
○ రూ.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరూ అనారోగ్యానికి భయపడే పరిస్థితి లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో రూ. 40 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కేవలం 18 నెలల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం సహాయనిధి ద్వారా రూ. 9. 67 కోట్ల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నామని వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనారోగ్య సమస్యలు వచ్చిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్నామని తెలిపారు. నగరంలోని జీజీహెచ్ లో కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దాతలు, ప్రభుత్వ సాయంతో అన్ని విభాగాలను పటిష్టం చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో వైద్య రంగాన్ని కూడా పూర్తి నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూనే సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గూగుల్ వంటి పెద్ద సంస్థలను రాష్ట్రానికి తీసుకొచ్చారని, లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా నిరుద్యోగ యువత భవితకు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుభిక్షపాలన సాగుతోందని, అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

# వెలుగుల రంగేళి - హోలి : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :చెడుపై గెలిచిన మంచికి సంకేతం హోలీ అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. మంచి సాధించే విజయాల వెలుగుల రంగేళీ అయిన హోలీతో అందరి జీవితాలు సుసంపన్నంగా రంగుల హరివిల్లు కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రమౌళినగర్‌లోని ఎమ్మెల్సీ నివాసం వద్ద మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన నాయక్‌లు తమ సాంప్రదాయాలకు అనుగుణంగా లేళ్ళ అప్పిరెడ్డికి టోపీ అలంకరించి, శాలువాతో సత్కరించారు. అనంతరం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, సమత, మమతలకు చిహ్నంగా, పేదా- పెద్ద తారతమ్యాలు లేకుండా, కులమత భేదాలు చూడకుండా, రంగుల్లో అంతా కలిసిపోయి ఆనందాలను పంచుకునేదే హోలీ అన్నారు. ప్రకృతి పరంగా కూడా హోలీకి ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నట్లు చెప్పారు. వసంత రుతువుకు స్వాగతం పలికే రంగుల సంబరమని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వివరించారు. ఈ వేడుకలలో వైసీపీ సీఈసీ సభ్యులు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, భాస్కర్ రెడ్డి, పరసా కృష్ణారావు, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ధనావత్తు వెంకటేశ్వర్లు నాయక్, వడిత్య సుఖునాయక్, శ్రీను నాయక్, దత్తు నాయక్, కొర్ర జగన్, బాషా, సుఖ్ఖో, శివ, రమావత్తు అశోక్, ప్రసన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

# 6న ఆర్టిఐహెచ్‌లో మెగా లోన్ మేళా-2026

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఈలు), స్టార్టప్‌లు, అభిలాషి వ్యాపారవేత్తలకు ఆర్థిక సదుపాయాలు కల్పించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) ఽ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) సంయుక్తంగా ఈనెల 6వ తేదీన మంగళగిరి ఆర్టీఐహెచ్ క్యాంపస్‌లో “లోన్ మేళా-2026” నిర్వహించ నున్నాయి. ఈ కార్యక్రమంలో 20కి పైగా జాతీయ బ్యాంకులు, ప్రముఖ ఆర్థిక సంస్థలు ఒకే వేదికపై పాల్గొననున్నాయి. ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, యువ వ్యాపారవేత్తలకు అవసరమైన సంస్థాగత మూలధనం, రుణ సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై సమగ్ర అవగాహన కల్పించడమే కాకుండా, నేరుగా బ్యాంకులతో సమావేశమై ఇన్-ప్రిన్సిపల్ లోన్ ఆమోదం పొందే అవకాశాన్ని కల్పించనున్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. ధాత్రి రెడ్డి, ఐఏఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,000కి పైగా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు ఈ మేళాలో పాల్గొనే అవకాశముందని తెలిపారు. ఈ లోన్ మేళా ద్వారా క్రెడిట్-లింక్డ్ సబ్సిడీ పథకాలు, ప్రభుత్వ మద్దతు కార్యక్రమాలపై ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకునే వీలుంటుందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో ముఖ్యాంశంగా పాల్గొనేవారికి ఉచితంగా ఏఐ ఆధారిత డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ సదుపాయం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రాజెక్టు ప్రతిపాదనల నాణ్యత మెరుగై రుణ ఆమోద అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. అదనంగా, క్రెడిట్ గ్యారంటీ విధానాలు, రిస్క్ మిటిగేషన్ ఫ్రేమ్‌వర్క్‌లు, క్రెడిట్ స్కోర్ మెరుగుదల, సరైన డాక్యుమెంటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక జ్ఞాన సదస్సులు నిర్వహించటంతో పాటు బ్యాంక్--ఇండస్ట్రీ సమన్వయాన్ని బలోపేతం చేయడమే ఈ మేళా ప్రధాన లక్ష్యమని తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తలు, ఎంఎస్ఎంఈలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చూసుకోవాలన్నారు.

# వైసిపి సోషల్ మీడియా ఫేక్ ప్రచారంపై రురల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు

○ ఐటిడిపి లీడర్ జెట్టి రేణుక



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వ్యవహారంలో తనపేరు, ఫోటోలను ప్రస్తావిస్తూ వైసీపీ సోషల్ మీడియా ఫేక్ ప్రచారం చేస్తోందంటూ తెనాలి పట్టణానికి చెందిన ఐ.టీడీపీ నాయకురాలు జెట్టి రేణుక పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈసందర్భంగా జెట్టి రేణుక మీడియాతొ మాట్లాడుతు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న మూడు ఫేస్ బుక్ ఖాతాలపై చర్యలకు డిమాండ్ చేస్తూ తెనాలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అసలు బిఆర్ నాయుడు తనకు పరిచయమే లేదని, వైసిపి సోషల్ మీడియా కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతుందని రేణుక ఆరోపించారు. టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు తనకు కారు కొనిచ్చారని,అది చాలక డబ్బులు కూడా డిమాండ్ చేశానని సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారానికి తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నట్లు తెలిపారు. తనకున్న కారుకు ఈ రోజుకి EMI లు కడుతున్నానని, లడ్డు వివాదాన్ని దారిమళ్లించటానికి ఇలాంటి దుర్మార్గపు పోస్టులు పెడుతున్నారని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి చెందిన కేంద్ర మంత్రి, రాష్ట్రమంత్రి, ఓ ఎమ్మెల్సీ ఉన్న నియోజవర్గంలో కూడా మహిళలపై వేధింపులు కొనసాగడం బాధాకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా తనని, తన కుటుంబాన్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ తీవ్రంగా వేధించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ కూడా మహిళలపై, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వేధిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను వేధిస్తున్న దుర్మార్గులను పట్టుకొని మిగతా వారికి భయం పుట్టేలాగా చెయ్యాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ లకు విజ్ఞప్తి చేశామన్నారు. వైసీపీ ముతాలును కట్టడి చెయ్యని పక్షంలో తన లాంటి మరెంతో మంది మహిళలు ఇబ్బందులు పడతారన్న విషయం, కూటమి ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడే వారిపై తనపోరాటం ఆగలేదని దుష్ప్రచారం ఎంత చేసిన వైసీపీ పై పోరాడే విషయంలొవెనక్కి తగ్గనని జెట్టి రేణుక స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా జెట్టి రేణుక ఇచ్చిన పిర్యాదు ఆధారంగా ఫేక్ వీడియో విషయంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సి ఐ నాయబ్ రసూల్ మీడియాకు తెలిపారు. ఇచ్చిన ఆధారాలతొ విచారణ చేపట్టి, ఫేక్ ఖాతలతొ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు.

# చిరువ్యాపారులకు నారా లోకేష్ చేయూత

○ బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు,ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేత



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్ అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, రూరల్ మండలంలోని పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు, ప్లాట్ ఫామ్ రిక్షాలను స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. మంగళగిరి పట్టణంలోని టిడ్కోకు చెందిన కొడాలి రమాదేవి, 29వ వార్డుకు చెందిన దామర్ల పద్మ, 3వ వార్డుకు చెందిన ఇండ్ల చిన్ని, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన యలగందుల సీతారావమ్మ, నిడమర్రు గ్రామానికి చెందిన మండేపూడి వీరయ్య జయానందంకు టిఫిన్ బళ్ళు అందజేశారు. టిడ్కోకు చెందిన కొండయ్యపాలేపు నారాయణరావుకు ఇస్త్రీ బండి, 20వ వార్డుకు చెందిన పల్లపు నాగమ్మకు తోపుడు బండి అందజేశారు. అలాగే నూతక్కి గ్రామానికి చెందిన పల్లాల వాణికి బడ్డీకొట్టు, తాడేపల్లి 7వ వార్డుకు చెందిన జుంజు త్రిపురకు ట్రై సైకిల్ అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టు, ఇస్త్రీ బండి, ప్లాట్ ఫామ్ రిక్షా, టిఫిన్, ట్రై సైకిల్, తోపుడు, టిఫిన్ బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లుతయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. వివిధ రకాల ఉపాధి కోసం మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల బండ్లు ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ ప్రధాన కార్యదర్శులు షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, పీఏసీఎస్ చైర్మన్ వల్లూరు వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బట్టు చిదానందశాస్త్రి, ఏఎంసీ డైరెక్టర్ బాబి, మాచర్ల శ్రీనివాసరావు, రాయపాటి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి కృషి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



○ గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక మహిళా గ్రీవెన్స్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వినిపించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు, టిడ్కో ఇళ్ల పంపిణీ మరియు నిర్మాణ సమస్యలు, అలాగే తమ నివాస ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్రంగా వివరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు.
ఈ సందర్భంగా ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, గృహ సమస్యల పరిష్కారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.
మహిళల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాల్లో ఒకటని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, పార్టీ కార్యాలయం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# బాణాసంచా దుకాణాలు, గోదాములపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



○ అగ్ని భద్రతా నిబంధనలు తప్పనిసరి - జిల్లా పోలీసుల హెచ్చరిక

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలోని బాణాసంచా దుకాణాలు, నిల్వ గోదాములు మరియు రిటైల్ అవుట్‌లెట్లపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు తమ పరిధిలో ప్రత్యేక దాడులు చేపట్టారు.
ఈ తనిఖీలలో అగ్ని భద్రతా ప్రమాణాలు, చట్టబద్ధ అనుమతులు, నిల్వ పరిమితులు, భద్రతా ఏర్పాట్లను సవివరంగా పరిశీలించారు. లైసెన్సులు, అగ్నిమాపక శాఖ అనుమతులు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇసుక బస్తాలు, నీటి డ్రమ్‌లు వంటి అత్యవసర సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. విద్యుత్ వైరింగ్ ప్రమాణాలు, ఓవర్‌లోడింగ్ పరిస్థితులు కూడా పరిశీలనకు వచ్చాయి. గరిష్ట నిల్వ పరిమితిని మించకుండా మాత్రమే పటాకులు నిల్వ చేయాలని, నివాస ప్రాంతాల్లో బాణాసంచా నిల్వ చేయరాదని వ్యాపారులకు స్పష్టం చేశారు. దుకాణాలలో “నో స్మోకింగ్” బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఖాళీగా ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ కూడా తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే 101 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రత దృష్ట్యా అన్ని బాణాసంచా వ్యాపారులు అగ్ని భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# యర్రబాలెంలో వ్యక్తి అనుమానస్పద మృతి

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): అనుమానస్పదస్దితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి మండలం యర్రబాలెం లో మంగళవారం జరిగింది. మంగళగిరి రూరల్ పోలీసుల సమాచారం మేరకు దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన కట్టెవరపు సుబ్బారావు (40) నాలుగు నెలల క్రితం కాటూరి కుమారి అనే మహిళతో కూలీ పనులు చేసుకునే క్రమంలో పరిచయం అయింది. కుమారి గతంలో మంగళగిరి పట్టణంలో నివాసం ఉండగా, గత పదేళ్ల క్రితం భర్తతో విభేధాలు రావటంతో విడిపోయి తన ఇద్దరూ పిల్లలతో మంగళగిరి మండలం యర్రబాలెం కృష్ణుని గుడి వెనుక బజార్ లో అద్దెకు నివాసం ఉంటుంది. సుబ్బారావు కు భార్య సంతోష కుమారి ఇద్దరూ పిల్లలు ఉన్నారు. ఉండవల్లి గ్రామంలో ఓ రైతు పోలంకు పురుగుమందు కొట్టి యర్రబాలెం కుమారి ఇంటికి మద్యం సేవించి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో సుబ్బారావు వచ్చాడు. ఉదయానే లేచి చూడగా పడుకున్న సుబ్బారావు మృతి చెందాడని , రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చానని, రాత్రి కాళ్లు చేతులు లాగుతున్నాయని మజ్జిగ తాగడాని పోలీసుల విచారణ కుమారి తెల్పింది. మంగళగిరి రూరల్ సిఐ ఎవి బ్రహ్మం, రూరల్ ఎస్ఐలు సిహెచ్ వెంకట్, రవితేజలు సంఘటన స్దలంకు చేరుకున్నారు.
మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పీ సిహెచ్ మురళీ కృష్ణ మృతదేహంను పరిశీలించి, స్దానికులను విచారించారు. ఘటన స్దలంలో క్లూస్ టీం పరిశీలన చేసింది. భార్య సంతోషకుమారి ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతికేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ ధర్యాప్తు చేస్తున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎన్జీవో ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా మహిళా దినోత్సవం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ కార్యక్రమాలు మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు నిత్య కార్యభారాల మధ్య ఇలాంటి రిఫ్రెష్మెంట్, రిక్రియేషన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఉద్యోగ జీవితంలో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

ఏపీ ఎన్జీవో మహిళా విభాగ చైర్‌పర్సన్ షేక్ తాజున్నీసా మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అమూల్యమని కొనియాడారు. మహిళల ఐక్యత, సృజనాత్మకతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు.జిల్లా కార్యదర్శి శ్యామ్ సుందర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకలను అందరూ కలిసి ఘనంగా విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. మహిళా ఉద్యోగుల చురుకైన పాల్గొనడం సంఘానికి గర్వకారణమని చెప్పారు.వేడుకలలో భాగంగా మంగళవారం ఇండోర్ క్రీడా పోటీలు నిర్వహించగా, బుధవారం అవుట్‌డోర్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మహిళా విభాగ కన్వీనర్ ఎం. విజయలక్ష్మి తెలిపారు.

కార్యక్రమంలో మహిళా విభాగ ప్రతినిధులు వాణి, విజయలక్ష్మి, శైలజ, నాగపావని, సునీత, జైనాబీ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగన్వాడీల అక్రమ నిర్బంధం అమానుషం




- ○ న్యాయం జరిగే వరకు పోరాటం
- ○ కాకుమాను లో అంగన్వాడీల నిరసన

**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):** న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు నిరసన తెలుపుతున్న అంగన్వాడీ ల అక్రమ అరెస్ట్ లు దారుణం అని కాకుమాను మండలం అంగన్వాడీ సిబ్బంది అన్నారు.కాకుమాను మండలం పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వ నిరంకుశ వైఖరికి కాకుమాను లో అంగన్వాడీ సిబ్బంది నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళన ఆందోళన చేస్తున్న యూనియన్ సభ్యులను విజయవాడ లో అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరకు శాంతియుతంగా ధర్నా చేస్తున్న వేలాది మంది అంగన్వాడీ లు నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున ధర్నా చౌకు లో అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అరెస్ట్ చేసిన అంగన్వాడీ లను,యూనియన్ నాయకులను తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. మహిళల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారన్నారు.అరెస్టైన వారిని సూదూర ప్రాంతాలకు తీసుకువెళ్లారన్నారు. అంగన్వాడీ ల పట్ల పోలీసులు తీరు మానవ హక్కుల ఉల్లంఘనే అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ సిబ్బంది ఆందోళన చేసిన సందర్బంలో ఆనాటి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఒప్పందం చేసుకున్నరన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా అక్రమ నిర్బందానికి దారుణమన్నారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడి అంగన్వాడీ సిబ్బందికి న్యాయమైన వేతనాల పెంపుదల, తదితర డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు శ్రీ వాసవి, శశికళ, ప్రేమ లత వివిధ గ్రామాల అంగన్వాడీ సిబ్బంధ్ధి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేత




**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నందు చంద్రగ్రహణం కారణంగా 3 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఏడు గంటల వరకు దేవస్థానం దక్షిణ ద్వారా తలుపులు మూసి ఉంచబడునని సంప్రోక్షణ అనంతరం తిరిగి నాలుగవ తేదీ ఉదయం 6 గంటల తర్వాత ఆలయ శుద్ధి పుణ్యా వచనం స్వామి వారికి విశేష అభిషేకం అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం సేవలు ప్రారంభమవుతాయని మటన్ మేనేజర్ ఈశ్వర చారి మరియు ఆలయ అర్చకులు తెలిపారు.

**ఈశ్వరీ దేవి మఠం నందు ఆలయం మూసివేత :** వీరబ్రహ్మేంద్రస్వామి పౌత్రి శ్రీ ఈశ్వరీ దేవి మఠం నందు కూడా గ్రహణం కారణంగా తలుపులు మూసివేసి తిరిగి నాలుగో తేదీ ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి పుణ్యా వచనం అభిషేకం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం లభిస్తాయని ఆలయ ఈ ఓ బివి జగన్మోహన్ రెడ్డి ఓ ప్రకటన తెలిపారు.

## శ్రీ కొండా సింగ రాయుడు స్వామి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మండల కేంద్రంలోని మిట్టమానుపల్లె వెళ్లే దారిలో శ్రీ ఈశ్వరమ్మ గృహ దగ్గరలో ఉన్న శ్రీ కొండ సింగరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు జరిగినట్లు దేవదాయ శాఖ ఆలయ ఈవో తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కొండ సింగ రాయుడు స్వామి ఉత్సవాలు మంగళవారం ఉదయం సుప్రభాత సేవ గ్రామస్తులు భజన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ,మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు స్థానిక ప్రజలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి కాయ కర్పూరం అందజేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు.

## వైభవంగా మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం

- ○ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు





**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంగళగిరి శ్రీ లతక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం రాత్రి 12 గంటల నుండి అంగ రంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఉత్సవ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీవారి కళ్యాణ మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రభుత్వం తరపున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి ప్రత్యేక ఆశీర్వచనాలు పొందారు. అంతకుముందు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులకు దేవాదాయ శాఖ కమిషనర్ కె రామచంద్రమోహన్, ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దివ్య కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదం పంపిణీ చేశారు. తెల్లవారుజామున 2 గంటలకు బంగారు గరుడోత్సవం మాడవీధులలో నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఏపీఎంఐడిసి చైర్మన్ చిలపల్లి శ్రీనివాసరావు, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినధులు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురలీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ కె వీరస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**చంద్రగ్రహణం కారణం ఆలయ ద్వార బంధనం.** ఉదయం 7.30 గంటల వరకు రథశాల వద్ద రథంపై స్వామి వారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తదుపరి ఉత్సవ మూర్తులను తొడ్కొని ఆలయంలోకి తీసుకువెళ్లారు. చంద్రగ్రహణం కారణంగా రథోత్సవం రద్దు చేయగా మిగిలిన కార్యాక్రమాలు యధావిధిగా జరిగాయి. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఎగువ దిగువ సన్నిధులు, ఉపాలయాలను ఉదయం 9 గంటలకు ధ్వార బంధనం చేశారు. తిరిగి బుధవారం గ్రహణశుద్ధి అనంతరం ఉదయం 7 గంటల నుండి స్వామి వారి దర్శనంకు భక్తులకు ఎగువ దిగువ సన్నిధులు, ఉపాలయాలలోకి అనుమతిస్తామని, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహాధికారి కోగంటి సునీల్ కుమార్ తెలిపారు.

## ఉగ్రదాడులపై మౌనం ఎందుకు, విదేశీ యుద్ధాలపై ఆవేశం ఎందుకు?

- ○ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అమెరికా–ఇజ్రాయిల్–ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న పరస్పర దాడుల నేపథ్యంలో భారతదేశంలో కొంతమంది మతోన్మాద వర్గాలు నిరసనలు వ్యక్తం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది షేక్ బాజీ ఘాటుగా స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో నివసిస్తూ దేశ ప్రయోజనాల కంటే విదేశీ దేశాల్లో జరిగే సంఘటనలపై ఆవేశంతో స్పందించడం బాధాకరమని అన్నారు. దేశంపై ప్రేమ, గౌరవం లేని వారు ఇక్కడ ఉండటానికి అర్హులు కారని, అలాంటి వారు దేశం విడిచి వెళ్లిపోవాలని కఠిన వ్యాఖ్యలు చేశారు.

మతం పేరుతో యుద్ధాలు చేయమని ప్రోత్సహించే పాలకులు ఉన్న దేశాల్లో మానవత్వం నశిస్తుందని పేర్కొన్న ఆయన, అలాంటి పరిణామాలకు భారతదేశ ప్రజలకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల మధ్య జరిగే దాడులు వారి అంతర్గత లేదా పరస్పర రాజకీయ అంశాలని, వాటిపై భారత్‌లో నిరసనలు వ్యక్తం చేయడం సమంజసం కాదని అన్నారు.

భారతదేశంలో జరిగిన ఉగ్రదాడుల సమయంలో కొంతమంది మౌనం వహించారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా పహల్గామ్, పుల్వామా వంటి ప్రాంతాల్లో ఉగ్రదాడులు జరిగినప్పుడు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు తెలియజేయలేదని ప్రశ్నించారు. భారతదేశంపై దాడులు జరిగితే స్పందించని వారు, ఇతర దేశాల్లో జరిగే ఘర్షణలపై ఇక్కడ నిరసనలు చేపట్టడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని వ్యాఖ్యానించారు.

దేశం కోసం బ్రతికేవాడే నిజమైన భారతీయుడని, దేశ ప్రయోజనాల కోసం ఆలోచించే వాడే దేశవాసిగా గౌరవించబడతాడని అన్నారు. దేశానికి కష్టం వచ్చినప్పుడు గళమెత్తలేని వారు ఈ దేశ నీళ్లు తాగడానికి కూడా అర్హులు కారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తులు దేశం పట్ల గౌరవంతో వ్యవహరించాలని, లేకపోతే ఈ దేశాన్ని విడిచి వెళ్లాలని సూచించారు.

భారతదేశం ప్రపంచ దేశాలన్నింటితో స్నేహభావాన్ని కొనసాగిస్తుందని, ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా మానవాళికి కలిగే నష్టాన్ని ఖండించే సంప్రదాయం భారత్‌కు ఉందని తెలిపారు. అయితే విదేశీ ఘర్షణలను దేశీయంగా మతపరమైన ఉద్రిక్తతలకు వేదికగా మార్చే ప్రయత్నాలు చేయరాదని హెచ్చరించారు. దేశంలోని ప్రజలు అన్నివర్గాలు కలిసి మెలిసి జీవించే సంస్కృతి భారత్ ప్రత్యేకత అని పేర్కొంటూ, అలాంటి సూత్రాలను మరింత బలోపేతం చేసే సామర్థ్యం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇతర దేశాల్లో జరుగుతున్న సంఘటనలను ఆధారంగా చేసుకుని దేశంలో విభజన వాతావరణం సృష్టించే ప్రయత్నాలను ప్రజలు తిరస్కరించాలని, దేశ సమగ్రత, ఐక్యత కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని షేక్ బాజీ పిలుపునిచ్చారు.

## ఆవుల చంద్రశేఖర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

- ○ ఘనంగా సత్కరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర అటవీ శాఖ సీనియర్ అధికారి, ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఆవుల చంద్రశేఖర్ కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసాపత్రం, ఘనంగా సత్కారం అందుకున్నారు.

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది "ఔషధ, సుగంధ మొక్కలు – ఆరోగ్యం – వారసత్వం – జీవనోపాధిని పెంపొందించడం" అనే అంశాన్ని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. "హనుమాన్" ఫౌండేషన్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మానవ – వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని పవన్ చెప్పారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ – వన్యప్రాణుల సంఘర్షణను నివారించి, సహాయం అందించే 'హనుమాన్' ఫౌండేషన్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో నేడు కీలకమైన రోజన్నారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ – వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టులో 100 వాహనాలను అటవీ శాఖకు అందించామని పవన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19 అత్యవసర సహాయ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఏడు చోట్ల అత్యవసర చికిత్స, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన వారికి 4 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెచ్చి అడవి ఏనుగులను కట్టడి చేశామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉందని ఆయన అన్నారు. హనుమాన్ ప్రాజెక్టును పకడ్బంధీగా రూపొందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ ప్రదర్శను పవన్ తిలకించారు. అటవీ వన్యప్రాణి సంరక్షణలో పాలుపంచుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

హనుమాన్ ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖకు రెస్క్యూ వాహనాలు, అంబులెన్సులను డిప్యూటీ సీఎం పవన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతికశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పిసిసిఎఫ్ డా. పివి చలపతిరావు, ప్రభుత్వ సలహాదారు పి. మల్లికార్జునరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, పలువురు అదనపు పిసిసిఎఫ్ లు, సిసిఎఫ్ లు, సిఎఫ్ లు, డిఎఫ్ఓలు, రేంజ్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీఏ అరియర్స్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలి

- ○ ఏపీ జేఏసీ అమరావతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జూలై నుంచి జనవరి 2024 వరకు ప్రకటించిన డీఏలకు సంబంధించిన అరియర్స్‌తో పాటు, జూలై 2024 నుంచి జనవరి 2026 వరకు ప్రకటించాల్సిన నాలుగు డీఏల అరియర్స్‌ను కూడా చెల్లించాల్సి ఉందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు.

సంక్రాంతి సందర్భంగా జూలై 2018 డీఏ అరియర్స్‌ను పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం నగదు రూపంలో చెల్లించిందని తెలిపారు. అయితే సాంకేతిక కారణాల వల్ల కొంతమంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఆ మొత్తాలు జమ కాలేదని వెల్లడించారు. బిల్లులు సమర్పించకపోవడం, ట్రెజరీ స్థాయిలో రిజెక్ట్ కావడం, సీఎఫ్ఎంఎస్‌లో రీసబ్మిట్ చేసే అవకాశం లేకపోవడం, కట్ ఆఫ్ తేదీ తర్వాత రిటైర్ కావడం, మరణించిన పెన్షనర్ల కేసులు, ఒక ట్రెజరీ నుంచి మరొకటికి మారడం, బ్యాంకుల విలీనాల కారణంగా ఖాతా వివరాలు అప్డేట్ కాకపోవడం, ఆధార్ లింక్ సమస్యలు వంటి కారణాల వల్ల చెల్లింపులు నిలిచిపోయాయని వివరించారు.

ఈ సమస్యలపై అనేక మంది ఉద్యోగులు, పెన్షనర్లు జేఏసీ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో, 21-01-2026న ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఆర్థిక శాఖ కార్యదర్శి అల్లాడి గౌతమ్‌ను కలిసి సమస్యను వివరించగా, ఏప్రిల్ నెలలో ఈ అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్ చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వెల్లడించారు.

కొంతమందికి చెల్లింపులు జరగగా, మరికొందరికి జరగకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉద్యోగులు, పెన్షనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఈహెచ్ఎస్ కమిటీలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలకు స్థానం

- ○ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఏపీ పీటిడీ ఎంప్లాయీస్ యూనియన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో సుమారు 16 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అమలులో ఉన్న ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించడం పట్ల ఏపీ పీటిడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కమిటీలో ఆర్టీసీ నుంచి ఏపీపీటిడీ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీపీటిడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులను చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సానుకూల నిర్ణయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అనుమతితో సోమవారం ఉత్తర్వులు జారీ చేసి, కమిటీలో చేసిన మార్పులను అమలు చేయాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈఓను ఆదేశించడం అభినందనీయమని తెలిపారు.

ఈ నిర్ణయం ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య సమస్యలు, పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు నేరుగా కమిటీ దృష్టికి వెళ్లే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను యూనియన్ రాష్ట్ర కమిటీ తరఫున స్వాగతిస్తున్నామని వెల్లడించారు.ప్రభుత్వం ఇదే విధంగా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అనారోగ్యంతో ఉన్న విద్యార్థినికి ఆర్థిక సహాయం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** అనారోగ్యంతో ఉన్న విద్యార్థిని కి మెరుగైన వైద్యం చేయించుకొవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ అన్నారు.బాపట్ల పట్టణంలోని స్థానం వారి వీధిలో ఉంటున్న టి. శ్రీనివాసరావు కుమార్తె సూర్యలంక రహదారిలోని సరస్వతి మెమోరియల్ జూనియర్ ఇంటర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతూ అనారోగ్యంతో ఉండడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ చదువులు తల్లిగా మంచిగా చదువుకుంటూ అనారోగ్య పాలై అయిందని, వైద్యం చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతూ పరీక్షలు రాస్తుందని అనారోగ్యంతో ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాలకు పరీక్ష రాస్తుందన్నారు.

విద్యార్థి తండ్రి వైద్య ఖర్చులకోసం ఆర్గనైజేషన్ ద్వారా సహాయం చేయాలని కోరడంతో సభ్యుల సహకారంతో విద్యార్థినీకి తమ వంతు సహాయాన్ని అందించామని చెప్పారు. మరికొందరు దాతలు ముందుకు వచ్చి విద్యార్థినికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి,కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు భీమా కోటేశ్వరరావు, బుర్ల సురేష్, ఓటికుండల లక్ష్మణరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి అంకమ్మ రావు, పెద్దమల్లు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక వారధులు... గమ్యమే కాదు... గాథలను వినిపించే సరికొత్త ప్రయాణం

- ○ 'డ్రైవర్-కమ్-గైడ్'!
- ○ వారధి.. కేవలం రవాణాకే కాదు, సంస్కృతికి కూడా!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఒక వినూత్న మలుపు తిరిగింది. సాధారణంగా ఒక పర్యాటకుడు కొత్త నగరంలో అడుగుపెట్టగానే మొదట కలిసేది, పలకరించేది ఆటో లేదా క్యాబ్ డ్రైవర్‌నే. ఆ మొదటి పరిచయమే ఆ నగరంపై, ఆ రాష్ట్రంపై ఒక అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఈ కీలకమైన అంశాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 'రాపిడో' సంస్థతో కలిసి చేపట్టిన 'డ్రైవర్–కమ్–గైడ్' శిక్షణ కార్యక్రమం పర్యాటక రంగంలో ఒక విప్లవాత్మక అడుగుకు నాంది పలికింది.

**డ్రైవర్ నుంచి రాయబారి వరకు:** విజయవాడ వేదికగా ప్రారంభమైన ఈ పైలట్ ప్రాజెక్ట్ కేవలం ఉపాధి నైపుణ్యాల పెంపు మాత్రమే కాదు, ఒక సామాజిక గౌరవ ప్రధాన ఉత్సవం. డ్రైవర్లను కేవలం వాహన చోదకులుగా చూడకుండా మన చరిత్రను, సంస్కృతిని చాటిచెప్పే 'పర్యాటక రాయబారులుగా' తీర్చిదిద్దడం వెనుక ఉన్న దూరదృష్టి అభినందనీయం. అమరావతి, నాగార్జునసాగర్ వంటి రాష్ట్రంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల గురించి కథల రూపంలో వివరించగలిగేలా వారికి శిక్షణ ఇవ్వడం వల్ల, పర్యాటకులకు కేవలం ప్రయాణం మాత్రమే కాకుండా ఒక అనుభూతి లభిస్తుంది. శిక్షణలో భాగంగా పర్యాటకులను ఆకట్టునేలా'జిజ్ఞాస ఆర్ట్‌వర్స్' సహకారంతో ప్రత్యేక స్టోరీ టెల్లింగ్ కోర్సుతో కేవలం చరిత్రనే కాకుండా, ఆధునిక సాంకేతికతను జోడించడం ఈ ప్రాజెక్టులోని అసలు సిసలు బలం. విదేశీ పర్యాటకులతో భాషా సమస్య లేకుండా సంభాషించడానికి భాషిణి యాప్ ఒక గొప్ప ఆయుధం. అదే విధంగా రాపిడో యాప్‌లో టూరిస్ట్ గైడ్ అని ప్రత్యేక ఐకాన్ ప్రవేశపెట్టి టెక్నాలజీ ద్వారా పర్యాటకులు సులభంగా సర్టిఫైడ్ డ్రైవర్లను గుర్తించే వీలు కల్పించడం వల్ల భద్రత, భరోసా రెండూ పెరుగుతాయి. ప్రధానంగా ఈ శిక్షణలో మహిళా డ్రైవర్ల భాగస్వామ్యం రాష్ట్ర పర్యాటక రంగంలో భద్రతకు, సమానత్వానికి నిదర్శనం. మహిళా పర్యాటకులు ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఇటువంటి శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లు ఉండటం వల్ల ఆంధ్రప్రదేశ్ ఒక సురక్షిత పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో పేరు గడిస్తుంది అన్నది కూటమి ప్రభుత్వ ఉద్దేశం.."ఇన్నాళ్లు మేము కేవలం డ్రైవర్లమే, కానీ ఇప్పుడు విజయవాడను మా కళ్లతో పర్యాటకులకు చూపించే రాయబారులుగా మారాము. ఇది మా వృత్తికి సమాజంలో గౌరవాన్ని పెంచుతుంది.ఈ శిక్షణ ద్వారా మేము పర్యాటకులతో మరింత ప్రొఫెషనల్‌గా వ్యవహరించగలం.దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులను సాదరంగా ఆహ్వానిస్తూ, విజయవాడ గొప్పతనాన్ని వారికి వివరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని శిక్షణ పొందిన డ్రైవర్లు చెబుతుండటం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ 'స్వదేశీ దర్శన్' పథకం స్ఫూర్తితో భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లను కేవలం వాహన సారథులుగానే కాకుండా, స్థానిక పర్యాటక రాయబారులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటల నేతృత్వంలో సాగుతున్న ఈ ప్రయోగం విజయవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజయవాడలో ప్రారంభమైన ఈ ప్రస్థానం త్వరలోనే తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాలకు విస్తరించడం పర్యాటక శాఖ ఆదాయానికే కాకుండా, వేలాది మంది డ్రైవర్ల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుంది. "అతిథి దేవో భవ" అనే సూక్తిని ఆచరణలో చూపిస్తూ, డ్రైవర్లను మన సంస్కృతికి వారధులుగా మార్చడం నిజంగా అభినందనీయం.



**పెంటమరాజు గోపాల్ రావు**
పీఆర్ఓ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు, కాంటాక్ట్: 9494273373

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467